

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

04.09.2026
శుక్రవారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 66
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# కొండా సురేఖ ఔట్

- బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం
- ఉత్తర్వులు జారీ చేసిన లోక్‌భవన్
- గవర్నర్ ఆఫీస్‌కు సీఎం రేవంత్ లేఖ
- మంత్రులతో కలిసి లోక్‌భవన్‌కు సీఎం
- రేవంత్ ముందే సంతకం చేసిన శివప్రతాప్ శుక్లా

గత కొన్ని రోజులుగా మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు, తదితర రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గం నుంచి ఒక మంత్రిని బర్తరఫ్ చేస్తూ గవర్నర్ నుంచి అధికారికంగా జీవో రావడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేగుతోంది. ఈ పరిణామంతో ఆమె తక్షణమే తన మంత్రి పదవిని కోల్పోనున్నారు. ఈ నిర్ణయానికి సంబంధించిన తదుపరి పరిణామాలు, ప్రభుత్వంలో జరగబోయే మార్పులపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. త్వరలోనే ఈ శాఖలను మరొకరికి కేటాయించడం లేదా ముఖ్యమంత్రి వద్దే ఉంచుకోవడంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.



హైదరాబాద్, సెప్టెంబర్ 04, అనంతనజనశక్తి న్యూస్

తెలంగాణ రాజకీయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ (బర్తరఫ్) ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ఆమోదం లభించింది. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఈ బర్తరఫ్ ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. అనేక పరిణామాల మధ్య కేబినెట్ నుంచి కొండా సురేఖను తొలగించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్ కార్యాలయానికి ప్రతిపాదన పంపారు. ఈ ప్రతిపాదనను పరిశీలించిన గవర్నర్.... వెంటనే ఆమోదం తెలుపుతూ రాజ్‌భవన్ ద్వారా ఉత్తర్వులు విడుదల చేశారు.

## కొండా దంపతుల దారెటు?

- మంత్రి పదవికి రాజీనామానా.!
- ఎమ్మెల్యే పదవికి గుడ్‌బై చెబుతారా?
- బైఎలక్షన్‌కు వెళ్తారన్న ప్రచారానికి ఆధారం ఎంత?
- అధిష్ఠానం ఆదేశాలపై సురేఖ వైఖరి ఏమిటి?
- వరంగల్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెర?

5లో..

తెలంగాణ ప్రతినిధి, సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్

తెలంగాణ రాజకీయాల్లో కొండా సురేఖ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకు మంత్రి పదవికి రాజీనామా చేయాలని సురేఖను కోరినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమెను మంత్రివర్గం నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టారు. ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించాలని కోరుతూ సీఎంవో గవర్నర్‌కు లేఖ పంపినట్లు తాజా సమాచారం. దీంతో 'రాజీనామా చేస్తారా?' అనే ప్రశ్నకు ప్రస్తుతానికి సమాధానం స్పష్టమైంది. సురేఖ స్వచ్ఛందంగా తప్పుకోలేదు. అయితే అసలు రాజకీయ ప్రశ్న ఇప్పుడు మంత్రి పదవికి మించి ఎమ్మెల్యే పదవిపైనే కేంద్రీకృతమైంది.

## స్నేహంతోనే నన్ను గెలవాలి నేను ఎవరికీ గులామ్‌ను కాదు

- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కామెంట్
- భారీ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభం
- నల్గొండ ఎక్స్ రోడ్డు నుంచి ఒవైసీ జంక్షన్ వరకు..

5లో..



హైదరాబాద్, సెప్టెంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

తననెవరూ బెదిరించవద్దని.. బెదిరిస్తే భయపడనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాతబస్తీలోని నల్గొండ ఎక్స్ రోడ్డు నుంచి ఒవైసీ జంక్షన్ వరకు నిర్మించిన భారీ స్టీల్ ఫ్లైఓవర్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పాల్గొని మాట్లాడారు. "బెదిరిస్తే భయపడను. స్నేహంతోనే నన్ను గెలవగలరు. నేను ఎవరికీ గులామ్‌ను కాదు.. దోస్తీకి మాత్రమే గులామ్‌ను. ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి.. గెలుపోటములు సహజం" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

## మినహాయింపులు ఇస్తేనే డీల్!

- అమెరికాతో తుది ఒప్పందం
- కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్
- ట్రంప్ ప్రతీకార సుంకాలతో ఇబ్బందులు

2లో..



## 2 ఏళ్ల తర్వాత సస్పెన్షన్ ఎత్తివేత

- ముంబై నటి కాదంబరి జత్వానీ కేసు
- ఐపీఎస్‌లు కాంతిరాణా, విశాల్ గున్నీకు ఊరట
- సర్వీసుల్లోకి తీసుకుంటున్నట్లు ఉత్తర్వులు
- కేసుల విచారణపై ప్రభావం చూపదని వెల్లడి

2లో..

## అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లు


- లోకల్ ఎన్నికలపై లోకేశ్ ఫోకస్
- అక్టోబర్ నుంచి అర్హులకు కొత్త పింఛన్లు
- దశలవారీగా పింఛన్లు ఇవ్వాలని సూచన
- అక్టోబర్‌లోగా స్థానిక ఎన్నికలు పూర్తి
- ఎన్నికల వాయిదాకు ఛాన్స్ లేదన్న లోకేశ్
- పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని ఆదేశం

2లో..



## 2027 ఫిబ్రవరి వరకు ఎల్ నినో

- 100% కొనసాగుతుందని డబ్ల్యూఎంవో హెచ్చరిక
- భారత్‌పై ప్రభావం చూపించే అవకాశాలే ఎక్కువ



2లో..

## ప్రైవేట్ స్కూళ్లలో 25% ఉచిత ప్రవేశాలు

- ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- కొత్త నిబంధనలపై కసరత్తు
- 16 మంది సభ్యులతో రాష్ట్ర స్థాయి కమిటీ
- సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా..
- కొత్త నిబంధనలు రానున్నాయి

2లో..

అమరావతి, సెప్టెంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)(c) ప్రకారం.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు అమలవుతున్న ప్రస్తుత మార్గదర్శకాలను సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## స్వయంకృతాపరాధమే

### కొండా సురేఖ బర్తరఫ్ వ్యవహారం: విప్

హైదరాబాద్, సెప్టెంబర్ 03, అనంతజనశక్తి న్యూస్

దేవాదాయశాఖ మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించడంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. ఆమె బర్తరఫ్ స్వయంకృతాపరాధమేనని అన్నారు. పార్టీ, ప్రభుత్వం కొండా సురేఖకు అనేక అవకాశాలు ఇచ్చినా.. వాటిని సద్వినియోగం చేసుకోలేదని విమర్శించారు. కొండా సురేఖ తన కుటుంబ సభ్యులను అదుపులో పెట్టుకోలేకపోయారని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై పదేపదే విమర్శలు చేయడం ద్వారా పార్టీ, ప్రభుత్వాన్ని బలహీనపరిచే ప్రయత్నం చేశారని అన్నారు.



2లో..

## కూతురు వ్యాఖ్యలే కారణం

- ఖర్గే వద్ద కూడా ఖండించలేదని వెల్లడి
- సమగ్ర విచారణ తర్వాతే నివేదిక: మల్లు రవి
- ఎంతటి పెద్దవారైనా నిబంధనలు పాటించాల్సిందే



2లో..


హైదరాబాద్, సెప్టెంబర్ 03, అనంతజనశక్తి న్యూస్

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రి కొండా సురేఖ బర్తరఫ్ వ్యవహారం తీవ్ర కలకలం రేపుతున్న వేళ, తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి ఇచ్చిన ఫేస్ టు ఫేస్ ఇంటర్వ్యూలో సంచలన విషయాలు వెల్లడించారు.

## రాఘవ్ చద్దాకు ఓటర్ లిస్ట్ షాక్

- ఇటీవల బీజేపీలో చేరిన ఆప్ నేత
- రాజకీయ కక్షతోనే ఓటు తొలగింపు: రాఘవ్ చద్దా

5లో..



## నిత్యావసరాల ధరల నియంత్రణకు మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలు

- రూ.35కే కిలో ఉల్లిపాయలు అందించేందుకు నిర్ణయం
- 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందులు కేటాయించాలని కేంద్రానికి విజ్ఞప్తి
- పామాయిల్‌ను సబ్సిడీ ధరలకు అందించేలా చర్యలు
- 10 వేల మెట్రిక్ టన్నుల కేఎన్ఎం రకం బియ్యం సేకరణకు ఆదేశం
- సామాన్యులపై ధరల భారం పడకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి – మంత్రివర్గ ఉపసంఘం

2లో..



అమరావతి, సెప్టెంబర్ 3: అనంత జనశక్తి న్యూస్

రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల నేపథ్యంలో వినియోగదారులపై భారం పడకుండా చేపట్టాల్సిన మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలపై మంత్రివర్గ ఉపసంఘం గురువారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఇటీవల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే అమలు చేస్తున్న బియ్యం మార్కెట్ ఇంటర్వెన్షన్ కార్యక్రమానికి అదనంగా ఉల్లిపాయలు, కందిపప్పు, పామాయిల్‌పై తక్షణమే మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలు చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది.



# మినహాయింపులు ఇస్తేనే డీల్!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 03, అనంతజనశక్తి న్యూస్

ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌కు సుంకాల విషయంలో మినహాయింపులకు అమెరికా అంగీకరించిన తర్వాతే ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తుది వివరాలను వెల్లడిస్తామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ గురువారం తెలిపారు. ''న్యూజిలాండ్‌తో వాణిజ్య ఒప్పందం త్వరలో అమలులోకి వస్తుంది.. ఆ తర్వాత 27 దేశాల కూటమి అయిన ఈయూతో అమలులోకి వస్తుంది.పోటీ దేశాలతో పోలిస్తే అమెరికా మనకు ప్రాధాన్యతా రేటును ఇచ్చేందుకు సిద్ధమైన వెంటనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఖరారు చేసి తుది వివరాలను ప్రకటిస్తాం'' అని పీయూష్ గోయల్ అన్నట్లు ఏఎన్ఐ వార్తా సంస్థ నివేదించింది. 'లేవరేజింగ్ ఎఫ్‌టీఏల ఆట్ రీచ్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాబోయే కొద్ది నెలల్లో కెనడా, మెక్సికో, చిలీ, మెర్కోసూర్, SACU (దక్షిణాఫ్రికా కస్టమ్స్ యూనియన్), GCC (గల్ఫ్ సహకార మండలి), ఇజ్రాయెల్ సహా ఇతర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (FTAలు), అలాగే ఆసియా, కొరియా, జపాన్ వాణిజ్య ఒప్పందాలను సమీక్షించే ప్రయత్నాలు, భారత్‌కు ఇతర పోటీదారుల కంటే తక్కువ రేటుకే ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం వాటాను అందిస్తాయని ఆయన అన్నారు. భారత్ ఇప్పటికే యూకే, మారిషస్, ఒమన్, యూఏఈ, ఆస్ట్రేలియాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు అమల్లోకి రానున్నాయని తెలిపారు.

భారత్‌అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ప్రస్తుతం చర్చల దశలో ఉంది. ఇరు దేశాలు మార్కెట్ విస్తరణ, వాణిజ్య అడ్డంకులను తొలగించడం, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ముసాయిదా ఒప్పందం ఇప్పటికే పూర్తయిందని, మరో మూడు నుంచి నాలుగు నెలల్లో దీనిపై సంతకాలు చేసే అవకాశం ఉందని ఒక సీనియర్ అమెరికా అధికారి జులైలో తెలిపారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న అమెరికా 'సెక్షన్ 301' వాణిజ్య విచారణలు మాత్రమే ఈ ఒప్పందానికి ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

రెండు దేశాల మధ్య ఒప్పందం 'కాగితంపై సిద్ధంగా ఉంది' అని, ఈ జాప్యం కేవలం సాంకేతిక విధివిధానాల వల్లనే తప్ప న్యూఢిల్లీ, వాషింగ్టన్ మధ్య పరిష్కారం కాని విభేదాల వల్ల కాదని ఆ అధికారి స్పష్టం చేశారు. మరోవైపు, ఇతర దేశాల కంటే భారతీయ ఎగుమతిదారులకు మరింత ప్రయోజనం చేకూరేలా తక్కువ పన్ను నిబంధనలను సాధించేందుకు భారత్ కృషి చేస్తోంది.

# ప్రైవేట్ స్కూళ్లలో 25% ఉచిత ప్రవేశాలు



(మొదటి పేజీ తరువాయి)

ఈ సవరణల రూపకల్పన, పకడ్బందీ అమలు కోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ ఏడాది జనవరి 13వ తేదీన దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక తీర్పుతో పాటు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఈ ఉచిత ప్రవేశాల ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఉచిత సీట్ల కేటాయింపులో ఎలాంటి అక్రమాలు జరగకుండా, అసలైన అర్హులైన నిరుపేద విద్యార్థులకే ఈ ప్రయోజనం అందేలా పాత నిబంధనలను సవరించి కొత్త మార్గదర్శకాలను రూపొందించనున్నారు.

**16 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ**

నూతన మార్గదర్శకాల సవరణ బాధ్యతలను వేగవంతం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఛైర్‌పర్సన్‌గా మొత్తం 16 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ కమిటీకి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సమీమ్ అన్సారియా ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు.

ఈ రాష్ట్ర స్థాయి కమిటీ విద్యా హక్కు చట్టం అమలు తీరును, ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాల విధానాన్ని లోతుగా అధ్యయనం చేస్తుంది. అర్హతల నిబంధనలు, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ, సీట్ల కేటాయింపు మరియు పాఠశాలల యాజమాన్యాలకు చెల్లించే ఫీజుల పునరుద్ధరణ వంటి అంశాలపై స్పష్టమైన నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తుంది.కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా రాష్ట్రంలో కొత్త ఉచిత ప్రవేశాల గైడ్‌లైన్స్‌ను త్వరలోనే అమలు చేయనున్నారు.

# స్వయంకృతాపరాధమే

## కొండా సురేఖ బర్తరఫ్ వ్యవహారం: విప్

(మొదటి పేజీ తరువాయి)



కుటుంబ సభ్యులు సీఎం గురించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన సమయంలో వారించడంలోనూ సురేఖ విఫలమయ్యారని పేర్కొన్నారు. కొండా సురేఖ వ్యవహారశైలిపై కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆది శ్రీనివాస్ తెలిపారు.

**గతంలోనూ సర్దుకుపోయారు: ఆది శ్రీనివాస్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొండా సురేఖపై కోపం ఎందుకు ఉంటుందని ఆయన ప్రశ్నించారు. అధిష్ఠానాన్ని సీఎం బ్లాక్‌మెయిల్ చేశారంటూ సురేఖ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని కొట్టిపారేశారు. కొండా సురేఖ కుటుంబ సభ్యులు గతంలో చేసిన వ్యాఖ్యల విషయంలోనూ సీఎం రేవంత్ రెడ్డి సంయమనంతో వ్యవహరించారని ఆది శ్రీనివాస్ చెప్పారు. ఇప్పుడు కూడా పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేసినా సీఎం ఎక్కడా బయటపడలేదని అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై గౌరవం ఉంటే కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచే చర్యలకు ఎందుకు పాల్పడ్డారని కొండా సురేఖను ప్రశ్నించారు.

**చిన్నారెడ్డిని కూడా..**

కొండా సురేఖతో పాటు సీనియర్ నేత చిన్నారెడ్డిని కూడా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించారని ఆది శ్రీనివాస్ గుర్తుచేశారు. చిన్నారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎంతో ఇష్టమైన నాయకుడని చెప్పారు. గతంలో ఆయనకు మద్దతుగా రేవంత్ రెడ్డి గోడలపై రాతలు రాసి ప్రచారం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. అయితే, పార్టీ, ప్రభుత్వాన్ని బలహీనపరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని కాంగ్రెస్ అధిష్ఠానం స్పష్టం చేసిందని ఆది శ్రీనివాస్ తెలిపారు.

# నిత్యావసరాల ధరల నియంత్రణకు మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ధరల పెరుగుదల ప్రభావం సామాన్య ప్రజలపై పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన కీలక నిత్యావసర వస్తువుల కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వంతో పౌరసరఫరాల శాఖ నిరంతరం సమన్వయం చేసుకోవాలని మంత్రులు సూచించారు.

**కిలో ఉల్లిపాయలు రూ.35కే**

వినియోగదారులకు కిలో ఉల్లిపాయలను రూ.35కే అందించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన ఉల్లిపాయల నిల్వలను రాష్ట్రానికి కేటాయించే అంశాన్ని NCCF దృష్టికి తీసుకెళ్లాలని సూచించింది. కేంద్రం నుంచి కేటాయించిన నిల్వలను రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందుల కేటాయింపునకు విజ్ఞప్తి, కందిపప్పు ధరల నియంత్రణకు కూడా మార్కెట్ ఇంటర్వెన్షన్ చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఇందులో భాగంగా 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందులను రాష్ట్రానికి కేటాయించాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖను కోరారు. వాటిని ప్రాసెసింగ్ చేసి రైతు బజార్లు, ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరసమైన ధరలకు కందిపప్పుగా వినియోగదారులకు అందించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

**పామాయిల్‌ను సబ్సిడీ ధరలకు అందించేలా చర్యలు**

పామాయిల్ ధరల పెరుగుదలను నియంత్రించేందుకు తక్షణ మార్కెట్ ఇంటర్వెన్షన్ చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. NCCF ద్వారా పామాయిల్ సేకరించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. NCCFతో సమన్వయం చేసుకుని అవసరమైన పామాయిల్‌ను సమకూర్చి వినియోగదారులకు సబ్సిడీ ధరలకు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించింది.

**651 ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం విక్రయాలు**

బియ్యం ధరల పెరుగుదలను కట్టడి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 651 ప్రత్యేక కౌంటర్లు, రైతు బజార్ల ద్వారా మార్కెట్ ఇంటర్వెన్షన్ కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 10,163 క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయించగా, దాదాపు లక్ష మంది వినియోగదారులు ప్రయోజనం పొందారు. వినియోగదారులు ఎక్కువగా ఇష్టపడే KNM రకం బియ్యాన్ని నెల్లూరు జిల్లాలోని రైస్ మిల్లర్ల నుంచి 10,000 మెట్రిక్ టన్నులు సేకరించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ఈ బియ్యాన్ని ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరసమైన ధరకు విక్రయించడం ద్వారా పెద్ద మొత్తంలో బియ్యాన్ని బహిరంగ మార్కెట్ లో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వినియోగదారులకు ధరల భారం నుంచి ఉపశమనం కల్పించాలని నిర్ణయించింది. ఉల్లిపాయలు, కందిపప్పు, పామాయిల్, బియ్యం సహా నిత్యావసర వస్తువుల ధరలు, నిల్వలు, సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కృత్రిమ కొరతకు అవకాశం లేకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. సామాన్య ప్రజలకు నిత్యావసరాలు అందుబాటు ధరల్లో లభించేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లు

అమరావతి, సెప్టెంబర్ 03, అనంతజనశక్తి న్యూస్

తెలుగుదేశం మంత్రులతో మంత్రి నారా లోకేశ్ బ్రేక్‌ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. కొత్త పింఛన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రధానంగా చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశల వారీగా కొత్త ఫించన్లు ఇవ్వాలని మంత్రి లోకేశ్ అన్నారు. వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ కొత్త ఫించన్లు ఇవ్వాలని మంత్రులకు తెలిపారు. అలాగే, స్థానిక ఎన్నికలకు అంతా సిద్ధమవ్వాలని.. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల్ని గెలిపించాలన్నారు. అక్టోబర్‌లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని..ఎన్నికలు వాయిదా పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

కోర్టు పెండింగ్‌లో ఉన్నవి కూడా త్వరితగతిన పరిష్కరించుకుని అన్నింటిలో ఎన్నికలు జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అన్నారు. తొలుత పురపాలికలు, తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికలు వాయిదా పడాలన్న గొడ్డలి పార్టీ కుయుక్తులు పని చేయవని చెప్పుకొచ్చారు. స్థానిక ఎన్నికలు వాయిదా పడితే ఫైనాన్స్ కమిషన్ నిధులు ఆగి రాష్ట్రానికి నష్టం జరగాలనే కుట్రతో గొడ్డలి పార్టీ ఉందని మండిపడ్డారు. అన్ని కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించుకుని అనుకున్న సమయానికి ఎన్నికలు నిర్వహించి తీరుతామని తేల్చిచెప్పారు. విద్యా శాఖను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రల పట్ల తనతో పాటు సంబంధిత మంత్రులూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి లోకేశ్ సూచించారు.

విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంక్షేమ శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కుట్రల్ని ధీటుగా తిప్పికొట్టాలని మంత్రి అన్నారు. మాట వినని అధికారుల్ని ఉపేక్షించేది లేదన్నారు. కొందరు అధికారుల పనితీరు శాఖకు, మంత్రికి చెడ్డపేరు తెచ్చేలా ఉంటే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. ఒకరిద్దరు అధికారుల తీరు వల్లే ఇటీవల కొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యాయని చెప్పుకొచ్చారు. వైద్య రంగానికి సంబంధించి ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని తప్పు పడుతూ కొందరు ట్రోల్ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి వాటిపైనా మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెప్టెంబర్ 9న అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి 3ఏళ్లు అవుతుందని, నాటి దుశ్చర్య నుంచి ఎన్నో సవాళ్లు ఎదుర్కొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తీరు అందరికీ గుర్తు చేసేలా సెప్టెంబర్ 9న ఓ కార్యక్రమానికి రూపకల్పన చేద్దామన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికలు, పొదుపు చర్యలతో సమస్యను అధిగమిద్దామని మంత్రులతో లోకేశ్ పేర్కొన్నారు.

ఎన్నికలు వాయిదా వేయాలని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని నారా లోకేష్ పేర్కొన్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించుకుని అనుకున్న సమయానికి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. విద్యా శాఖను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు చేస్తున్న ఆరోపణలు, ప్రచారాలపై మంత్రులు అప్రమత్తంగా ఉండాలని లోకేష్ సూచించారు. విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంక్షేమ శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ తప్పుడు ప్రచారాలను సమర్థంగా తిప్పికొట్టాలని సూచించారు.

మంత్రికి, శాఖకు చెడ్డపేరు వచ్చేలా కొందరు అధికారుల పనితీరు ఉంటే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమని మంత్రి లోకేష్ హెచ్చరించారని తెలుస్తోంది. ఒకరిద్దరు అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఇటీవల కొన్ని సమస్యలు తలెత్తాయని, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్య రంగంలో చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ జరుగుతోందని లోకేష్ పేర్కొన్నారు. అందువల్ల సంబంధిత మంత్రులు, అధికారులు తమ శాఖలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు.

సెప్టెంబర్ 9న పార్టీ అధినేతపై జరిగిన పరిణామాలను ప్రజలకు గుర్తు చేసేలా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని నారా లోకేష్ సూచించినట్లు సమాచారం. గతంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రభుత్వ ప్రస్థానాన్ని ప్రజలకు వివరించేలా కార్యక్రమాన్ని రూపొందించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. నీటి పొదుపు చర్యలను పటిష్టంగా అమలు చేసి భవిష్యత్‌లో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని మంత్రులకు సూచించారు.

# కూతురు వ్యాఖ్యలే కారణం

(మొదటి పేజీ తరువాయి)



పార్టీలో ఎంతటి పెద్ద పదవిలో ఉన్నవారైనా క్రమశిక్షణ పాటించాల్సిందేనని, లక్ష్మణ రేఖ దాటితే ఎంతటి వారికైనా చర్యలు తప్పవని ఆయన తేల్చి చెప్పారు. కూతురు వ్యాఖ్యలను ఖండించకపోవడమే కారణం కొండా సురేఖపై చర్యలు తీసుకోవడానికి ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలే ప్రధాన కారణమని మల్లు రవి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిని ఎవరైనా బహిరంగంగా దూషిస్తే లేదా విమర్శిస్తే, దానిని వెంటనే ఖండించాల్సిన ప్రాథమిక బాధ్యత క్యాబినెట్ మంత్రిగా ఉన్న కొండా సురేఖపై ఉందన్నారు. కానీ, తన కూతురు తప్పు చేసిందని ఆఖరికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వద్ద కూడా ఆమె ఒప్పుకోకపోవడం, కనీసం ఆ వ్యాఖ్యలను ఖండించకపోవడం సరికాదన్నారు. పార్టీలో ఏవైనా సమస్యలు లేదా అభిప్రాయభేదాలు ఉంటే అంతర్గతంగానే పరిష్కరించుకోవాలి తప్ప రోడ్డున పడేయకూడదని హితవు పలికారు.

**సమగ్ర విచారణ తర్వాతే నివేదిక**


కొండా సురేఖపై గతంలో కూడా పలు ఫిర్యాదులు క్రమశిక్షణ సంఘానికి అందాయని మల్లు రవి వెల్లడించారు. చట్టప్రకారం ఫిర్యాదు వచ్చినప్పుడు మాత్రమే తాను క్రమశిక్షణ సంఘం ఛైర్మన్‌గా సమగ్ర నివేదికను తయారు చేసి అధిష్టానానికి ఇచ్చానని తెలిపారు. కొండా సురేఖతో పాటు చిన్నారెడ్డి విషయంలోనూ పూర్తి వివరాలు సేకరించి, వారి వ్యాఖ్యల వల్ల కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని గుర్తించిన తర్వాతే రిపోర్ట్ సమర్పించామన్నారు. ఈ నిర్ణయంలో ఎలాంటి కులాల ప్రాతిపదికన చర్యలు ఉండవని, కేవలం పార్టీ క్రమశిక్షణ మేరకే జరిగాయని స్పష్టం చేశారు.

**ఎంత పెద్దవారైనా లక్ష్మణ రేఖ దాటొద్దు**

ఈ రాజకీయంపై రాష్ట్రమంతటా తీవ్ర ఉత్కంఠ నెలకొన్న తరుణంలో ఏఐసీసీ నుంచి తుది నిర్ణయం వెలువడిందని తెలిపారు. నిర్ణయం తీసుకోవడం కొద్దిగా ఆలస్యమైనా పర్వాలేదు కానీ, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలనే ఉద్దేశంతోనే ప్రక్రియను నిర్వహించామని చెప్పారు. హోదా లేదా పదవి ఎంత పెద్దదైనా కాంగ్రెస్ పార్టీ నియమావళిని ఎవరూ అతిక్రమించకూడదని, పార్టీ నిర్దేశించిన లక్ష్మణ రేఖను దాటవద్దని ఈ నిర్ణయం ద్వారా నిరూపితమైందని మల్లు రవి తేల్చి చెప్పారు.

# 2027 ఫిబ్రవరి వరకు ఎల్ నినో

హైదరాబాద్, సెప్టెంబర్ 03, అనంత జనశక్తి న్యూస్



ప్రపంచ వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపించే ''ఎల్ నినో'' మరింత బలపడినట్లు ప్రపంచ వాతావరణ సంస్థ తెలిపింది. ఎల్ నినో 2027 ఫిబ్రవరి వరకు కొనసాగేందుకు 100 శాతం అవకాశం ఉందని వెల్లడించింది. దీంతో రుతుపవనాలు, ఉష్ణోగ్రత, వర్షాలపై ప్రభావం తప్పకపోవచ్చు. ఎల్ నినో ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో స్పష్టంగా ఏర్పడిందని, రాబోయే రోజుల్లో మరింత తీవ్రం కానుందని వెల్లడించింది. 2027 ప్రారంభం వరకు ఎల్ నినో కొనసాగించే అవకాశం దాదాపు 100 శాతంగా ఉండటంతో వ్యవసాయం, ఆరోగ్యం, విద్యుత్, నీటి వనరులు వంటి వాతావరణ సున్నిత రంగాలు ముందస్తు సన్నద్ధతను పెంచుకోవాలని సూచించింది.

ఎల్ నినోకు కీలకమైన నినో 3.4 ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా భారీగా పెరిగాయి. 2026 మేజూలై మధ్య సగటున 1.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉండగా, జూలైలో ఇది 2 డిగ్రీలకు చేరింది. జూలై చివరి నుంచి ఆగస్టు మధ్య వారాల్లో ఈ వ్యత్యాసం సుమారు 2.2 నుంచి 2.6 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదైంది. సముద్ర ఉపరితలం కింద పరిస్థితులు కూడా అసాధారణంగా ఉన్నాయి. ఉష్ణమండల పసిఫిక్ లోని కొన్ని ప్రాంతాల్లో జూలై, ఆగస్టు ప్రారంభంలో సముద్రం లోపల ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 8 డిగ్రీల సెల్సియస్ పైగా నమోదయ్యాయి. ఇవన్నీ ఎల్ నినో బలపడేందుకు అనుకూల పరిస్థితులు కల్పించాయని వాతావరణ సంస్థ తెలిపింది.

**భారత్‌పై ప్రభావం ఎంత..?**

ఎల్ నినో ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో ఒకేలా ఉండదు. కానీ భారత్‌కు ఇది కీలక వాతావరణ సంకేతంగా మారింది. ముఖ్యంగా నైరుతి రుతుపవనాలపై ప్రభావం చూపించే అవకాశం ఉంది. గతంలో అనే సందర్భాల్లో ఎల్ నినో ఏర్పడిన సందర్భంలో భారత్‌లో రుతుపవనాలు చాలా బలహీనంగా మారిన చరిత్ర ఉంది.

2026లో భారత్‌లో ఇప్పటికే సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) అంచనా వేసింది. భారత్‌పై ఎల్ నినో ప్రభావాన్ని పాజిటివ్ ఇండియన్ ఓషన్ డైపోల్ (IOD) కొంతవరకు మార్చే అవకాశం ఉందని WMO తెలిపింది. 2026 సెప్టెంబర్‌నవంబర్ కాలంలో పాజిటివ్ IOD అభివృద్ధి చెందుతుందని అంచనా వేస్తోంది.

**ప్రపంచ వాతావరణంపై తీవ్ర ప్రభావం..**

చాలా బలమైన ఎల్ నినో ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, ఉష్ణోగ్రతలు, వాతావరణ ప్రసరణలో గణనీయమైన మార్పులకు దారితీయవచ్చు. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వేడి, కరువు, మరికొన్ని ప్రదేశాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించే అవకాశాలు పెరుగుతాయి. అయితే, ఎల్ నినో ఎంత బలంగా ఉందనే విషయం ఏ దేశంపై ఎంత తీవ్ర ప్రభావం ఉంటుందో నిర్ణయించదు. ప్రాంతీయ పరిస్థితులు, సముద్ర ఉష్ణోగ్రతలు, ఇతర వాతావరణ వ్యవస్థలు కూడా ప్రభావాన్ని మార్చే అవకాశం ఉందని WMO స్పష్టం చేసింది.

# 2 ఏళ్ల తర్వాత సస్పెన్షన్ ఎత్తివేత

అమరావతి, సెప్టెంబర్ 03, అనంతజనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో సీనియర్ ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలకు చంద్రబాబు ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ముంబై నటి కాదంబరి జత్వానీ కేసులో గతంలో సస్పెండ్ అయిన ఈ ఇద్దరు ఐపీఎస్ అధికారులపై ఉన్న సస్పెన్షన్‌నురాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. వారిని తక్షణమే తిరిగి సర్వీసులోకి తీసుకుంటూ సాధారణ పరిపాలన శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గత 2 ఏళ్లుగా సస్పెన్షన్‌లో ఉన్న వీరిద్దరూ త్వరలోనే విధుల్లో చేరనున్నారు. 2004 బ్యాచ్‌కు చెందిన కాంతి రాణా టాటా.. 2010 బ్యాచ్‌కు చెందిన విశాల్ గున్నిలపై గతంలో సస్పెన్షన్ వేటు పడింది. అప్పటి నుంచి దాదాపు 2 ఏళ్లుగా వారు సస్పెన్షన్‌లో కొనసాగుతున్నారు. తాజాగా సస్పెన్షన్ గడువు ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశాన్ని సమీక్షించి కీలక నిర్ణయం తీసుకుంది.

ఇద్దరు ఐపీఎస్‌లపై వేసిన సస్పెన్షన్‌ను ఎత్తివేయడానికి ముందు రాష్ట్ర డీజీపీ సమర్పించిన నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే ఐపీఎస్ అధికారి కాంతి రాణా టాటా ఆగస్ట్ 24వ తేదీన సమర్పించిన వినతిపత్రాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. నిబంధనలకు అనుగుణంగా అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ పేరుతో ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సస్పెన్షన్ ఎత్తివేత ఉత్తర్వుల ప్రతులను ఇద్దరు అధికారులకు అందజేసి.. వారి నుంచి రసీదులు తీసుకోవాలని డీజీపీని ప్రభుత్వం ఆదేశించింది.

ముంబైకి చెందిన నటి కాదంబరి జత్వానీ వ్యవహారంలో అక్రమంగా కేసు నమోదు చేసి, ఆమెను అరెస్టు చేసి వేధించారనే ఆరోపణలు అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. ఈ వ్యవహారంలో అప్పటి విజయవాడ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన కాంతి రాణా టాటా.. అప్పటి డీసీపీ విశాల్ గున్నీలపై ఆరోపణలు వచ్చాయి. జత్వానీని అరెస్టు చేసిన తీరుపై నమోదైన కేసు, ఆ తర్వాత జరిగిన విచారణల నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం ఈ ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ విధించింది. కేసు దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని అప్పట్లో రివ్యూ కమిటీ అభిప్రాయపడినట్లు సమాచారం. దీంతో సస్పెన్షన్‌ను కొనసాగిస్తూ వచ్చారు. అయితే వారిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసినంత మాత్రాన కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలపై ఉన్న ఆరోపణలు లేదా కేసులు ముగిసినట్లు కాదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వారిపై కొనసాగుతున్న శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు, క్రిమినల్ కేసులపై సస్పెన్షన్ ఎత్తివేత నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపదని ఉత్తర్వుల్లో పేర్కొంది. అంటే ఇద్దరు అధికారులు తిరిగి సర్వీసులోకి వచ్చినప్పటికీ, జత్వానీ కేసుకు సంబంధించిన దర్యాప్తు, న్యాయపరమైన ప్రక్రియలు వాటి దారిలో అవి కొనసాగనున్నాయి. సస్పెన్షన్ ఎత్తివేత కేవలం సర్వీస్ నిబంధనల ప్రకారం తీసుకున్న పరిపాలనా నిర్ణయంగానే ప్రభుత్వం స్పష్టం చేసింది. తాజా నిర్ణయంతో ఇద్దరు ఐపీఎస్ అధికారులు తిరిగి విధుల్లోకి చేరనున్నారు.

# పిల్లల్ని నేరగాళ్లుగా పరిగణించకూడదు

**- 20 ఏళ్ల క్రితం విధించిన శిక్ష రద్దు**



పిల్లల్ని నేరగాళ్లుగా పరిగణించకూడదని సుప్రీం కోర్టు స్పష్టంచేసింది. ఆరోపిత నేరం చేసినప్పుడు మైనర్‌గా ఉన్న ఒక వ్యక్తికి పడిన శిక్షను రద్దుచేసింది. బాలలకు చట్టబద్ధంగా ఉన్న ప్రయోజనాలను తోసిపుచ్చజాలరని జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ శ్రీచంద్రశేఖర్‌ల ధర్మాసనం బుధవారం వ్యాఖ్యానించింది. ''పరిస్థితుల చేతిలో బాలలు బాధితులు అవుతుంటారు. సామాజికఆర్థిక పరిస్థితులు, భావోద్వేగ/మానసిక అంశాలు కూడా కొన్నిసార్లు వారిని నేర ప్రపంచం వైపు నడిపిస్తుంటాయి. శాశ్వతంగా నిందితునిగా ముద్రవేసే బదులు అలాంటి వాళ్లను సమాజంలో తిరిగి కలిసేలా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. బాలల న్యాయ చట్టం కల్పిస్తున్న రక్షణల గురించి ఆయా పక్షాలకు అవగాహన ఉండటం లేదు. పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వల్ల వలసలతో ప్రజల జీవితాలు మారిపోతున్నాయి. పట్టణాల్లో జనాభా, పేదరికం, అసమానత, నిరక్షరాస్యత, వివక్షాపూరిత వాతావరణం పెరిగి పిల్లల్ని అపరాధులుగా మారుస్తోంది. అది వారిని బాధితులుగా మారుస్తోంది'' అని ఒక కేసు తీర్పులో ధర్మాసనం విశ్లేషించింది.

సాధారణంగా దర్యాప్తు అధికారులు ఆయా కేసుల్లో బాలల వయసుపై దృష్టి సారించరని, దానివల్ల హక్కుల ఉల్లంఘన జరగడమే కాకుండా బాలలు బాధితులు అవుతున్నారని వ్యాఖ్యానించింది. ''ఏ దేశానికైనా బాలలే పెద్ద ఆస్తి. వారు బాధ్యతాయుత పౌరులుగా, అన్నివిధాలా దృఢంగా, ఆరోగ్యకరంగా ఉంటూ సమాజ అభ్యున్నతికి దోహదపడేలా చేయాలి. పిల్లలపై ప్రభుత్వాలు చేసే ఖర్చు.. వారు శక్తిమంతమైన మానవ వనరులుగా మారి, దేశాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు శక్తిమంతులైనవారిగా మారినప్పుడు తిరిగి వచ్చేస్తుంది. దర్యాప్తు ప్రక్రియ సమర్థతను పెంచేలా ప్రస్తుత వ్యవస్థ మారాలి'' అని న్యాయమూర్తులు ఆకాంక్షించారు. మధ్యప్రదేశ్‌లోని మురైనాలో 2004 సెప్టెంబరులో నమోదైన ఒక కేసు విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఒక మహిళ, ఆమె బిడ్డ మృతదేహాలు రైలుపట్టాలపై లభ్యమైన కేసులో పలువురిపై కేసు నమోదైంది. ఇది వరకట్న చావు అని, ఆధారాలు మాయం చేసేందుకు నిందితులు ప్రయత్నించారని అభియోగాలు నమోదయ్యాయి. నిందితుల్లో ఒకరి వయసు 17 ఏళ్లు. దీంతో కేసు తొలుత హైకోర్టుకు, తర్వాత సుప్రీంకోర్టుకు వచ్చింది.

**- ఆపరేషన్ సిందూర్‌లో వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌కు నేతృత్వం వహించిన ఐఏఎఫ్ సీనియర్ అధికారి**

**- 5,585 దరఖాస్తులను వడగట్టి ఎంపిక**

## అయోధ్య రామాలయ ట్రస్ట్ తొలి సీఈవోగా ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) జితేంద్ర మిశ్ర

భారత వాయుసేన (ఐఏఎఫ్) మాజీ ఉన్నతాధికారి, ఎయిర్‌మార్షల్ జితేంద్ర మిశ్ర.. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తొలి సీఈవోగా బుధవారం నియమితులయ్యారు. సీఈవో పోస్టుకు మొత్తం 5,585 దరఖాస్తులు రాగా వివిధ దశల్లో వాటిని వడగట్టిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రమోద్ కోహ్లీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ...చివరకు అన్ని విధాలా అర్హతలున్న, అత్యంత సమర్థులైన ముగ్గురు అభ్యర్థుల పేర్లను ట్రస్ట్‌కు సిఫార్సు చేసింది. ఆ ముగ్గురిలో ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) జితేంద్ర మిశ్ర (62) ఎంపికయ్యారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో అత్యంత కీలకమైన వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌కు ఎయిర్ మార్షల్ జితేంద్ర నేతృత్వం వహించారు. విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు 'సర్వోత్తమ్ యుద్ధ సేవా మెడల్' పురస్కారం లభించింది. సైన్యంలో దీర్ఘకాలం సేవలందించినందుకు గాను 'అతి విశిష్ట సేవా మెడల్', 'విశిష్ట సేవా మెడల్' పురస్కారాలనూ ఆయన అందుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని దేవరియా జిల్లాకు చెందిన జితేంద్ర మిశ్ర...1986 డిసెంబరు 6న పైలట్‌గా ఐఏఎఫ్‌లో చేరారు. వివిధ హోదాల్లో 39ఏళ్ల పాటు సేవలందించారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న పదవీ విరమణ చేశారు. రామాలయ విరాళాల చోరీ వివాదం నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తొలిసారి సీఈవోని నియమించాలని నిర్ణయించింది.

భారీ సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన, వడపోతకు కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఎంపిక కమిటీ వినియోగించింది. దీనిలో భాగంగా 5,585 మంది అభ్యర్థుల్లో 3,577 మంది మాత్రమే 600 మార్కుల విధానం కింద పరిశీలన కోసం వివరాలను సమర్పించారు. ఈ ప్రక్రియలో 470కి పైగా మార్కులు వచ్చిన 108 మంది అభ్యర్థులను వర్చువల్ విధానంలో ఇంటర్వ్యూలు చేశారు. వీరి నుంచి 16 మంది అభ్యర్థులను ఎంపిక చేసి అయోధ్యలో ఆగస్టు 11, 12 తేదీల్లో ముఖాముఖి భేటీలు నిర్వహించారు. చివరకు సమర్థ నాయకత్వ లక్షణాలు, నిర్వహణ నైపుణ్యాలు, సత్యనిష్ఠ, దార్శనికత గలిగిన ముగ్గురు అభ్యర్థుల జాబితాను ఎంపిక కమిటీ రూపొందించి ట్రస్ట్‌కు అందజేసింది.





**ప్రధాన కార్యదర్శిగా గోవింద్ దేవ్ గిరి**

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బుధవారం సమావేశమై ఎంపిక కమిటీ సమర్పించిన సీఈవో అభ్యర్థుల జాబితాను పరిశీలించింది. సీఈవోగా జితేంద్ర మిశ్ర వైపు మొగ్గు చూపింది. ట్రస్ట్ మాజీ కోశాధికారి గోవింద్ దేవ్ గిరిని.. ప్రధాన కార్యదర్శిగా, మహేశ్ భాగ్‌చంద్కాను కోశాధికారిగా నియమించింది. ట్రస్ట్ సభ్యులుగా అయోధ్యకి చెందిన మదన్ మోహన్ పాండే, దిల్లీకి చెందిన బాగ్‌చంద్కా, నిర్మల్ యాదవ్‌లను బోర్డులోకి తీసుకున్నారు.

# విడిగా ఉంటూ భార్యగా ఉంటానంటే ఎలా?



**- జంటకు సుప్రీంకోర్టులో విడాకులు**

వివాహాన్ని కాపాడటమే సంబంధిత చట్టం ప్రాథమిక లక్ష్యమైనా భార్యాభర్తలు దీర్ఘకాలం పాటు విడివిడి ఉంటున్నప్పుడు ఆ పరిస్థితిలో వాస్తవికతను గుర్తించాల్సిందేనని సుప్రీంకోర్టు పేర్కొంది. 2005 డిసెంబరు నుంచి వేర్వేరుగా జీవిస్తున్న దంపతులకు విడాకులు మంజూరుచేస్తూ జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ శ్రీచంద్రశేఖర్‌ల ధర్మాసనం బుధవారం ఈ వ్యాఖ్య చేసింది. భార్యకు శాశ్వత భరణం కింద రూ.7 లక్షలు చెల్లించాలని భర్తను ఆదేశించింది. మధ్యప్రదేశ్ హైకోర్టు తనకు విడాకులు మంజూరు చేయడానికి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ భర్త సుప్రీంకోర్టును ఆశ్రయించారు. భర్తను విడిచిపెట్టే ఉద్దేశం భార్యకు లేదని హైకోర్టు భావించడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది.

అత్తవారింటికి తీసుకువెళ్లేందుకు భర్త ఎన్ని ప్రయత్నాలు చేసినా తగిన కారణం లేకుండానే ఆమె నిరాకరించేదని గుర్తుచేసింది. దంపతులకు పిల్లలు లేకపోవడం, రాజీ కుదిర్చే ప్రయత్నాలు ఇన్నేళ్లలో విఫలం కావడం వల్ల విడాకులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ''ప్రస్తుత కేసులో భార్య తన వైవాహిక సంబంధ బాధ్యతల్ని నిర్వర్తించేందుకు సుముఖత వ్యక్తంచేశారు. ఆమె ప్రవర్తన వేరేవిధంగా ఉన్నందువల్ల కేవలం హామీ సరిపోదు. వివాహ బంధం పునరుద్ధరించగల స్థితిలో ఉందా, లేదా అనేది తేల్చడంలో వారిద్దరూ దీర్ఘకాలం నుంచి విడివిడిగానే జీవిస్తున్నారనేది కీలకమైన అంశమని మరో తీర్పులోనూ సుప్రీంకోర్టు గతంలో చెప్పింది'' అని వివరించింది.

సంధికాలంలో కమిషన్లు పనిచేయకపోవడం తగదు

రాష్ట్ర, జిల్లా స్థాయి వినియోగదారుల కమిషన్లలో ఖాళీల గురించి స్థాయీ నివేదికపై రాష్ట్రాలన్నీ మూడు వారాల్లో స్పందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేవలం సంధికాలం వల్ల ఏ కమిషన్ కూడా పని చేయకపోవడం తగదని స్పష్టంచేసింది. కమిషన్ సభ్యులకు జీతభత్యాలపై తాము ఇదివరకు ఇచ్చిన ఆదేశాలపై చర్యా నివేదికను సమర్పించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనల ధర్మాసనం బుధవారం ఆదేశించింది.

**నీట్-పీజీ రీఎగ్జామ్‌పై..**

నీట్ పీజీ పరీక్షను రాయలేకపోయిన 2,445 మంది కోసం దానిని మళ్లీ నిర్వహించాలని నిర్ణయించడాన్ని కొంతమంది సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఇదివరకు సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన ఉత్తర్వును ఇది ఉల్లంఘిస్తోందని వారు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనానికి తెలిపారు. దీనిపై అత్యవసర విచారణ జరపాలని కోరారు. జస్టిస్ పి.ఎస్.నరసింహా నేతృత్వంలోని ధర్మాసనం నీట్ వ్యవహారాలన్నింటిపై విచారణ చేపట్టిన దృష్ట్యా అక్కడే దీనిని ప్రస్తావించాలని సీజేఐ సూచించారు.

# డంపింగ్ యార్డుగా మారిన నదిని శుభ్రం చేసి.. సామాజిక స్పృహ చాటి!





సాధారణంగా డిగ్రీ చదివే విద్యార్థులు స్నేహితులతో కాలక్షేపం, పరీక్షలు, భవిష్యత్తు కార్యాచరణకే ఎక్కువ సమయం కేటాయిస్తుంటారు. కానీ, ఓ డిగ్రీ విద్యార్థి మాత్రం తన ఆలోచనలను పర్యావరణ పరిరక్షణ వైపు మళ్లించాడు. కాలుష్యం బారినపడిన ఓ నదిలో కొంత భాగం శుభ్రం భాష్ అనిపించుకున్నాడు. అతడి సామాజిక స్పృహకు సంబంధించిన కథనాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా బియోరా పట్టణానికి చెందిన బిట్టూ తబాహి డిగ్రీ చదువుతున్నాడు. స్థానికంగా ప్రవహించే అజ్నార్ నదిలో ఓ చోట భారీ స్థాయిలో చెత్త పేరుకుపోవడాన్ని గమనించాడు. ప్లాస్టిక్ వ్యర్థాలతో డంపింగ్ యార్డుగా కనిపిస్తోన్న నదిని చూసి ఎలాగైనా శుభ్రం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఈ ఏడాది జనవరి 26న రంగంలోకి దిగాడు. అతడికి ఈత కూడా రాదు. గ్లౌజ్‌లు, బూట్లు లేకపోయినా వ్యర్థాలు తొలగించే పని మొదలుపెట్టాడు.

కొన్ని రోజులకే బిట్టూ చేతులతోపాటు తోడుగా వచ్చిన ఓ మిత్రుడి కాళ్లకూ ఇన్‌ఫెక్షన్ సోకింది. దీంతో కుటుంబీకులు ఇలాంటి పనులు వద్దని సూచించారు. అయినా బిట్టూ వెనకడుగు వేయలేదు. అందులోని వ్యర్థాలను బయటకు తీసి కంపోస్టుగా మార్చాడు. స్నేహితులతో కలిసి నగదు సేకరించి వ్యర్థాలను తొలగించేందుకు అవసరమైన పరికరాలు, చెత్త డబ్బాలను కొనుగోలు చేశాడు. బురదనూ తొలగించాడు. కొన్ని నెలల్లోనే ఆ నది శుభ్రంగా మారిపోయింది. ఇందుకోసం దాదాపు రూ.30వేలు ఖర్చు పెట్టాడట. యువకుడు చేసిన ఈ ప్రయత్నాలు కొన్ని రోజుల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఈ యువకుడి గురించి ఆనంద్ మహీంద్రా కూడా ఓసారి ప్రస్తావించారు. విమర్శలు వచ్చినప్పటికీ సామాజిక స్పృహ కనబరుస్తూ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాడంటూ కొనియాడారు. ఇదిలాఉంటే, బిట్టు ఇంటిపేరు తబాహి.. అంటే హిందీలో విధ్వంసం, వినాశనం అని అర్థం. అందుకు అనుగుణంగానే కాలుష్యాన్ని నాశనం చేయడమే తన ఆశయమని, ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన నదిని పునరుద్ధరించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నానని బిట్టూ చెప్పడం విశేషం.

## జగన్నాథుడి బ్యాంక్ బ్యాలెన్స్ రూ.1912 కోట్లు.. 60,821 ఎకరాల భూమి..!

**ఒడిశాలోని పూరీ జగన్నాథుడికి వేల కోట్ల రూపాయల ఆస్తులున్నాయి. ఆ ఆలయం పేరిట దేశవ్యాప్తంగా వివిధ జాతీయ బ్యాంకుల్లో ఉన్న ఖాతాల్లో రూ.1,912 కోట్ల డిపాజిట్లు ఉన్నట్లు శ్రీ జగన్నాథ ఆలయ పాలనావిభాగం (ఎస్‌జేటీఏ) ఒక ప్రకటనలో వెల్లడించింది. వాటిలో రూ.1,811 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో ఉండగా.. మరో రూ.100.71 కోట్లు సేవింగ్స్, కరెంట్ ఖాతాల్లో ఉన్నట్లు తెలిపింది. డిపాజిట్ చేసిన మొత్తంలో రూ.500 కోట్లు ఒడిశా ప్రభుత్వం అందించిన కార్పస్ ఫండ్ అని పేర్కొంది. స్వామివారి పేరిట దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 60,821 ఎకరాల భూమి ఉంది. ఇందులో 60,426 ఎకరాలు ఒడిశాలోనే ఉన్నాయి. ఆలయ రత్నభండార్‌లో బంగారు, వజ్రాల ఆభరణాలు ఉన్నాయి. ఆలయానికి వచ్చే ఆదాయంలో.. భక్తులు ఇచ్చే కానుకలు, ఆలయం పేరిట ఉన్న క్వారీలు, గనుల నుంచి వచ్చే సొమ్ము, డిపాజిట్లపై వడ్డీ, ప్రభుత్వ గ్రాంట్లు, భూవిక్రయాలు భాగమని పాలనా విభాగం పేర్కొంది. "ఈ ఆదాయంలో ఒక భాగాన్ని కార్పస్ ఫండ్‌గా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తాం. ఫౌండేషన్ ఫండ్‌గా ఇంకొంత మొత్తాన్ని జమ చేస్తాం. మిగతా సొమ్మును ఆలయ నిధిగా ఉంచుతాం" అని ఎస్‌జేటీఏ ప్రధాన పాలనాధికారి వెల్లడించారు.**

**ఇక, ఆలయ నిధిని రోజువారీ ఖర్చుల కోసం వాడుతుంటారు. హుండీ విరాళాలను ప్రతిరోజూ లెక్కిస్తారు. ఆ వివరాలను ఎప్పటికప్పుడు భక్తులు తెలుసుకునేలా ఏర్పాట్లు ఉన్నాయి. అలాగే పూరీ ఆలయం 'సమర్పణ్' పేరిట ఒక డిజిటల్ డొనేషన్ ప్లాట్‌ఫామ్‌ను కూడా నిర్వహిస్తోంది.**

## నారీకేళంతో.. నమో లంబోదరా!



దేశంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలు పూజలందుకుంటాయి. ఈసారి మరో సరికొత్త రూపంలో వినాయకుడు దర్శనమివ్వనున్నాడు. ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా కేరళంలోని తిరువనంతపురంలో బుధవారం నిర్వహించిన ప్రదర్శనలో కొబ్బరి చిప్పలతో రూపొందించిన లంబోదరుడి విగ్రహాలు, ఇతర ప్రతిమలు ఆకట్టుకున్నాయి. 'స్థానిక సుస్థిరత, జీవనోపాధి మెరుగుదల' ఇతివృత్తంగా ఈ ప్రదర్శనను ఏటా నిర్వహిస్తుంటారు.

## బట్ట మేక పక్షులను రక్షించుకోవాలి



అంతరించిపోతున్న బట్టమేక పక్షి(గ్రేట్ ఇండియన్ బస్టర్డ్)ని రక్షించుకునేందుకు 16 ప్రదేశాలను ప్రాధాన్య సంరక్షణ ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని దేహ్రాదూన్‌లోని భారత వన్య ప్రాణి సంస్థ పరిశోధకులు సూచించారు. దాదాపు 18,000 చదరపు కిలోమీటర్లలో విస్తరించిన ఈ ప్రదేశాలు 35 జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. వాటిలో మహారాష్ట్రలో 22, కర్ణాటక, తెలంగాణలలో ఆరు చొప్పున, ఆంధ్రప్రదేశ్‌లో ఒకటి ఉన్నాయి. బట్టమేక పక్షి ప్రపంచంలోనే అత్యంత బరువైన ఎగిరే పక్షులలో ఒకటి. ఒక పక్షి బరువు 15 కిలోగ్రాముల వరకు ఉంటుంది. గుబ్బి ల్యాబ్స్ అనే భారతీయ పరిశోధనా సంస్థ అధ్యయనం ప్రకారం ఇటీవల భూ వినియోగంలో వచ్చిన మార్పుల వల్ల మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో బట్టమేక పక్షుల సంఖ్య పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని దీన్ని నివారించి ఆ పక్షులను కాపాడుకోవాలని తెలిపింది.

## 200 ఏళ్ల తర్వాత అమ్మాయి.. సంబరాలు మోత మోగాయి



ఆడపిల్లల జననంపై ఇప్పటికీ సంకుచిత దృక్పథంతో ఉన్న మన సమాజంలోని ఎంతోమందికి ఇదో సానుకూల సందేశం. ఆ కుటుంబంలో ఏకంగా 200 ఏళ్ల తర్వాత ఓ ఆడపిల్ల పుట్టింది. కొన్ని తరాల పాటు ఎదురుచూసిన క్షణం కళ్ల ముందు సాక్షాత్కరించడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. తమ ఇంటి మహాలక్ష్మిని దారి పొడవునా సంబరాలతో ఇంటికి తీసుకొచ్చారు. ఈ ఘటన మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో జరిగింది. లింబాజీ కుటుంబానికి చెందిన రిషికేశ్ దహిఫాలే భార్య పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఈ చిన్నారికి 'గార్గి' అని పేరు పెట్టారు. ఆస్పత్రి నుంచి ఇంటి వరకు రథంపై ఊరేగిస్తూ మేళతాళాలు, నృత్యాలతో చిన్నారిని తీసుకొచ్చి బంధుమిత్రుల సమక్షంలో ఘనస్వాగతం పలికారు. ఇన్నాళ్లకు ఆ మహాలక్ష్మి కరుణించి, తమ ఇంట అడుగు పెట్టిందని తాత లింబాజీ దహిఫాలే ఆనందం వ్యక్తం చేశారు. ''కూతుళ్ల ప్రేమ ఎప్పుడూ ప్రత్యేకమే. నేను నా చిట్టిపాపను అపురూపంగా పెంచుతాను'' అని గార్గి తండ్రి సంతోషం వ్యక్తం చేశారు.

## సీజేపీ తనిఖీ చేసిన పాఠశాల భవనం కూల్చివేత

**రాజస్థాన్ రాజధాని నగరమైన జైపుర్ సమీప సంగనేర్ బ్లాకులో ఉన్న రాంపుర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పాత భవనాన్ని అధికారులు కూల్చివేశారు. ఏడాది కిందటే శిథిలావస్థలో ఉన్నట్లు ప్రకటించిన ఈ పాఠశాలను 'స్కూల్ లీక్ కరో' కార్యక్రమంలో భాగంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలు ఆగస్టు 21న తనిఖీ చేశారు. బడిలోని పిల్లలకు పశువుల పాకలో చదువులు చెబుతున్నట్లుగా బయటపెట్టారు. ఇదే సందర్భంగా సీజేపీ బృందాన్ని గ్రామస్థులు అడ్డుకొని దాడికి దిగిన విషయం తెలిసిందే. దీనిపై ఇరువైపులా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. తమపై దాడి భాజపా కార్యకర్తల పనిగా సీజేపీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు, విద్యాశాఖ అధికారుల సమక్షంలో పాత భవనం కూల్చివేత జరిగింది. ఈ పాఠశాలకు కొత్త భవనం నిర్మాణానికి రూ.18 లక్షలు మంజూరుచేస్తూ రాజస్థాన్ ప్రభుత్వం ఆగస్టు 23న ఉత్తర్వులు జారీ చేసింది.**

## ఒంటికాలితో గెంతుతూ బడికి.. ఏడేళ్ల చిన్నారి చదువు సంకల్పం

**ఉత్తర్‌ప్రదేశ్‌లోని బలియా జిల్లా రాణీపుర్‌కు చెందిన రాగిణి (7)కి అందరు పిల్లల్లా తానూ ఆడుకోవాలని ఉన్నా.. ప్రమాదం కారణంగా ఓ కాలు అవిటిగా మారడంతో వీలుపడలేదు. చదువు విషయంలో మాత్రం అలాగని ఆమె ఊరుకోలేదు. స్నేహితులు భుజాలకు సంచులు వేలాడేసుకొని స్కూలుకు వెళ్తుంటే.. తానూ వెళ్తానని పట్టుబట్టింది. ఇంటి నుంచి దాదాపు అర కిలోమీటరు ఉన్న పాఠశాలకు నిత్యం ఒంటికాలితో గెంతుతూ వెళ్తోంది. ఆర్నెల్ల వయసులో రాగిణికి జరిగిన ప్రమాదం తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స చేయించామని, మెరుగైన చికిత్సకు ఆర్థికస్తోమత చాలక ఇంటికి తీసుకువచ్చేసినట్లు ఆమె తల్లి బబితాదేవి తెలిపారు. రాగిణి తండ్రి ఓ దినకూలీ. ఒకటో తరగతి చదువుతున్న ఈ చిన్నారి కథ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ స్పందించారు. రాగిణికి ట్రైసైకిలు, ఆమె కుటుంబానికి రూ.26,500 ఆర్థికసాయాన్ని అందించారు. వీడియోకాల్ ద్వారా మాట్లాడి, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. జిల్లా కలెక్టర్ మంగళ ప్రసాద్ సింగ్ బాలిక ఇంటికి వెళ్లి మాట్లాడి, తగిన వైద్యసాయం అందిస్తామని హామీ ఇచ్చారు.**



# ట్రంప్‌కు ఎదురుగాలి!

**రెండో దఫా అధికార పీఠం అధిరోహించి కూడా రెండేళ్లు కావస్తున్నా అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్‌కు దౌత్యనీతి ఒంటబట్టలేదు. తాను నిర్దేశించినదాన్ని అంగీకరించటమే తప్ప మరోవిధంగా మాట్లాడే హక్కు, అధికారం ఏ దేశానికీ లేదని ఆయన ఇప్పటికీ నమ్ముతున్నారు. ఆయన దృష్టిలో కేవలం అదే దౌత్యం. భారత్ నుంచి కెనడా వరకూ... ఇరాన్ నుంచి వెనిజులా వరకూ ఆయనది ఇదే బాణీ. ట్రంప్‌ను నేరుగా ప్రతిఘటించే వారుండొచ్చు, పరోక్షంగా చెప్పిచూద్దామనుకునే వారుండొచ్చు... మార్గాలు వేరైనా ట్రంప్ షరతులకు తలొగ్గబోమని చెప్పడమే వీరందరి సారాంశం.**

**చాన్నాళ్లుగా విసుగెత్తి ఉన్నారేమో... కెనడా ప్రధాని మార్క్ కెర్నీ చాలా కరకుగానే వ్యవహరించారు. ఒకదాని వెంబడి మరో గొంతెమ్మ కోర్కెతో చీకాకుపరుస్తున్న అమెరికా తీరును నిరసిస్తూ వాణిజ్య ఒప్పందంపై చర్చలు సాగిస్తున్న తమ ప్రతినిధి బృందాన్ని వెనక్కురావాలని ఆదేశించారు. ఒప్పందం దాదాపు ఖరారై సంతకాలు జరపడమే తరువాయి అనుకునే దశలో ఎదురైన ఈ ఊహించని పరిణామం అమెరికాను అయోమయంలోకి నెట్టింది. ఇలాంటి భంగపాట్లే ఇరాన్ దగ్గర ఎదురయ్యాయి. మన దేశంతో చర్చలు ఒక కొలిక్కి వచ్చాయని అమెరికా అనేకమార్లు ప్రకటించింది. కానీ అదేమీ జరగలేదు.**

**వెనిజులా అధ్యక్షుడు మదురోను ట్రంప్ తన సైన్య బలంతో ఈ ఏడాది మొదట్లో అపహరించి, అమెరికాలో ఆయనపై విచారణ తంతు సాగిస్తున్నారు. ఇకపై అది తమ భూభాగమని అమెరికా చెప్పడం ఆ దేశ ప్రజల్ని మాత్రమే కాదు... అత్యధిక దేశాలను ఆగ్రహోదగ్రుల్ని చేస్తోంది. ఇక ఇరాన్ సంగతి చెప్పనవసరం లేదు. యుద్ధాన్ని తాత్కాలికంగా నిలిపేశామని చెప్పటం నుంచి హొర్ముజ్ తమదేనని ప్రకటించటం వరకూ ట్రంప్ ఎన్ని చేసినా ఇరాన్ నిబ్బరంగా 'నీ లెక్కేమిట'న్నట్టే వ్యవహరిస్తోంది.**

**మిత్ర దేశమైన దక్షిణ కొరియాదీ అదే వైఖరి. ఏటా 11 రోజులపాటు అమెరికా, దక్షిణ కొరియాలు ఉమ్మడి సైనిక విన్యాసాలు జరుపుతాయి. ఈసారి అయిదో రోజుకల్లా అమెరికా సైనికులు తట్టా బుట్టా సర్దుకుని తిరుగుముఖం పట్టారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్‌తో చెలిమి కోసం ట్రంప్ తహతహలాడటంపై ఆగ్రహించి దక్షిణ కొరియా ఈ నిర్ణయం తీసుకుందంటున్నారు. ఈ విన్యాసాల ఉద్దేశం ఉత్తర కొరియాను భయపెట్టడం. తీరా ఆ దేశంతోనే అమెరికా చేతులు కలుపుతుంటే... ఈ విన్యాసాలకు అర్థమేమిటన్నది దక్షిణ కొరియా ప్రశ్న. వాస్తవానికి ఉత్తర కొరియా పూర్తి స్థాయి అణ్వస్త్ర దేశంగా మారింది. ఆ దేశం దగ్గర 'చాలా శక్తిమంతమైన' ఆయుధా లున్నాయని ట్రంపే కొద్దికాలం క్రితం ప్రకటించారు. దాన్ని మరిచి కొత్త చుట్టరికాలు కలుపుకుందామని ట్రంప్ ప్రయత్నించినంత మాత్రాన ఆ దేశం నమ్మే అవకాశమేమీ లేదు.**

**ఇరాన్‌తోసహా అన్ని దేశాలతోనూ దౌత్యపరంగా వరస వైఫల్యాలు తప్పడం లేదు గనుక ఉత్తర కొరియాకు దగ్గరై అమెరికా జనాన్ని ఆశ్చర్యపరచాలని ట్రంప్ భావిస్తున్నట్టు కనబడుతోంది. కానీ వేరే దేశాలతో పెంచుకున్న వైరం వికటిస్తున్న విధంగానే ఉత్తర కొరియాతో చెలిమి సైతం బెడిసికొట్టే అవకాశం లేకపోలేదు. చివరకు ఉత్తర కొరియాపం చేస్తుందన్నది అలావుంచితే... ఆసియా–పసిఫిక్ దేశాలన్నిటా ట్రంప్ అంతరంగంపై ఇప్పటికే ఉన్న సందేహాల్ని మరింతగా పెంచింది. ఈ దేశాలన్నీ చైనా దూకుడువల్ల చాలా ఇబ్బంది పడుతున్నాయి. ఇలాంటి సమయంలో తమకు అండగా నిలిచి, చైనాకు కళ్లెం వేయాల్సిన అమెరికా ఆడుతున్న వింతనాటకాలు వాటికి మింగుడుపడటం లేదు.**

**అందుకే దక్షిణ కొరియా, జపాన్ ఇటీవల సాన్నిహిత్యమవుతున్నాయి. ఆ రెండింటిమధ్యా ఇబ్బందికర చరిత్రవున్నా ట్రంప్ వింత చేష్టలు వారిని సన్నిహితం చేశాయి. కెనడా ఉత్పత్తులపై 50 శాతం అదనపు సుంకాలు వేయాల్సివస్తుందని ట్రంప్ ప్రకటించగా, దానికి ప్రతిగా వచ్చే నెల 8 నుంచి అమెరికా ఉత్పత్తులపై 15 నుంచి 50 శాతం వరకూ సుంకాలు విధిస్తామని కెర్నీ ప్రకటించారు. అమెరికా అదనపు సుంకాల విలువ 2,000 కోట్ల డాలర్లయితే, కెనడా సుంకాలు 2,760 కోట్ల డాలర్లు. ఈ ప్రపంచం తనకు భయపడటం మాట అటుంచి... జాలి కూడా చూపబోదని ట్రంప్‌కు ఎంత త్వరగా తెలిస్తే అమెరికా ప్రజలకు అంత మేలు.**



# 'పీఓకే' పాకిస్థాన్ చేజారుతోందా?

**ఇంతకాలం తమను పాకిస్థానీయులుగా భావించుకుంటూ, భారతీయ హోదా ఎన్నటికీ అంగీకరించబోమని చెబుతూ వస్తున్న పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజానీకం నేడు పాకిస్థాన్ చెర నుంచి విముక్తం కావాలని ఆందోళన బాట పట్టడం ఓ గొప్ప చరిత్రాత్మక పరిణామం. గత కొంతకాలంగా పీఓకేలోని ప్రజలు తీవ్రమైన ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారు. బియ్యం, గోధుమలు, నూనెలు, పప్పుధాన్యాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పెట్రోల్ ధరలు మండిపోతున్నాయి. అధిక ధరలు, నిరుద్యోగం తదితర సమస్యలతో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 45 లక్షల మంది సతమతమవుతున్నారు.భారత భూభాగం నుంచి ఆక్రమించుకున్న ఈ ప్రాంతాన్ని పాకిస్థాన్ 'ఆజాద్ కశ్మీర్'గా పిలుచుకుంటోంది. ఈ ప్రాంతానికి ప్రజలు ఎన్నుకునే ప్రధానమంత్రి, అధ్యక్షుడు, శాసన వ్యవస్థ, సొంత అధికారిక జెండా మొదలైనవి ఉన్నప్పటికీ పాలనాధికారాలన్నీ పాకిస్థాన్ ప్రభువుల చేతుల్లోనే ఉంటాయి.భారత్‌ను బూచిగా చూపిస్తూ ఇన్నాళ్లూ పాక్ పాలకులు పీఓకే ప్రజలను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. అయితే పాక్ కారణంగా అనేక ఏళ్లుగా పీఓకేలో అభివృద్ధి నిలిచిపోయింది. ప్రజలకు స్వేచ్ఛ లేదు. ఉగ్రవాద కార్యకలాపాలు ఒక్కటే అక్కడ పెరిగాయి. పీఓకేను చెప్పు చేతల్లో పెట్టుకున్న పాకిస్థాన్‌ను దారుణమైన ఆర్థిక సంక్షోభం వెంటాడుతోంది. మరోవైపు భారత్‌లో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా జమ్మూ కశ్మీర్ క్రమంగా పూర్వస్థితికి చేరుకుంటోంది. కశ్మీర్ లోయలో ఉగ్రవాద కార్యకలాపాలు బాగా తగ్గిపోయాయి. కాశ్మీరీ పండిట్లకు స్థానిక ముస్లిం ప్రజలు సాదర ఆహ్వానం పలుకుతున్నారు. పర్యాటక రంగం గణనీయంగా కోలుకుంది. జమ్మూ కశ్మీర్‌కు చెందిన క్రీడాకారులు దేశం తరపున వివిధ క్రీడలలో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో అంతర్జాతీయ సమాజానికి గొప్ప సంకేతం ఇచ్చినట్లయింది.**




అంతర్జాతీయ పరిణామాలు.. ముఖ్యంగా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, తాజాగా ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికాల మధ్య సాగుతున్న భీకరపోరు కారణంగా అనేక దేశాలలో వాణిజ్యం, ఎగుమతి దిగుమతులు నిలిచిపోయి అవి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. అయితే, 145 కోట్ల జనాభా కలిగిన భారత్ మాత్రం కొద్దిపాటి ఒడుదుడుకులు మినహా దృఢంగా, నిబ్బరంగా నిలబడగలుగుతోంది. శాస్త్ర సాంకేతిక రంగాలలో, ఆహార భద్రతలో భారత్ ప్రపంచ దేశాలలో మొదటి పది స్థానాలలో ఒకటిగా నిలబడగలిగింది.

దివాళా అంచున నిలబడిన పాకిస్థాన్ గత ఏడు దశాబ్దాలకు పైగా తన నియంత్రణలో ఉంచుకున్న పీఓకేపై పట్టు కోల్పోతున్న సూచనలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఆ ప్రాంతంలో ప్రస్తుతం పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు హోరెత్తుతున్నాయి. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ), స్థానిక రాజకీయ పార్టీలు, సంస్థలతో ఏర్పడిన ఐక్య కార్యాచరణ సమితి వంటివి.. ప్రభుత్వ వైఫల్యాలను ముఖ్యంగా అదుపుతప్పిన ధరలు, ఆహారం, విద్యుత్ కొరతలను నిరసిస్తూ వీధుల్లోకి వచ్చి ఆందోళన చేస్తున్నాయి.

ఆశ్చర్యం ఏమంటే, జేఏఏసీ చేపట్టిన ఈ ఆందోళన కార్యక్రమాలలో పాల్గొంటున్న ప్రజలు 'పీఓకే పాకిస్థాన్‌లో భాగం కాదు' అనే నినాదాలు చేస్తున్నారు. తమ ప్రాంతంలో అనేక దశాబ్దాలుగా కొనసాగుతున్న పాకిస్థానీ ఉన్నత వర్గాల ప్రత్యేక హక్కులను, సదుపాయాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పీఓకేలో సాగుతున్న ఆందోళనను బలప్రయోగంతో అణచివేయాలని పాక్ పాలకులు చూస్తున్నారు. అత్యంత అమానవీయంగా పాకిస్థాన్ భద్రతా దళాలు పీఓకే ప్రాంతంలో ప్రసార మాధ్యమాలను నియంత్రిస్తున్నాయి. ఇంటర్‌నెట్ సౌకర్యం లేకుండా చేశాయి. పైగా, ప్రజలకు నిత్యావసర సరుకులు, వైద్య సామగ్రిని సైతం నిలిపివేయడం అంతర్జాతీయ సమాజాన్ని నివ్వెరపరుస్తోంది. పీఓకేలోని ప్రజలను పాకిస్థాన్ తమ సొంత పౌరులుగా భావించేటట్లయితే ఆర్థిక దిగ్బంధనాలు ఎలా విధిస్తారని అక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తమను ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణించే ఇటువంటి వైఖరి కారణంగానే.. స్వతంత్ర పౌరులుగానో లేదా కశ్మీరీ పౌరులుగానో తమను గుర్తించాలని కోరుతున్నామని పీఓకేలోని మెజారిటీ ప్రజలు వాదిస్తున్నారు.

పాక్ ఆక్రమిత కశ్మీర్ తమ దేశంలో అంతర్భాగమని భారత్ మొదటి నుంచి వాదిస్తూనే ఉంది. ఈ కారణంతోనే పీఓకేను పాకిస్థాన్ చిత్రపటంలో భాగంగా చూపించదు. పైగా జమ్మూ కశ్మీర్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో కూడా రాష్ట్ర శాసనసభలో 24 అసెంబ్లీ స్థానాలను పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌కు కేటాయించారు. ఈ ప్రాంతంపై భారతదేశానికి ఉన్న చిరకాల రాజ్యాంగ హక్కును, శాసనహక్కును నొక్కి చెప్పేందుకే ఈ స్థానాలను గతంలో లాగా ఖాళీగా ఉంచి రిజర్వ్ చేశారు. అంటే ఈ ప్రాంతం భారత్ పరిపాలనలోకి వస్తే పీఓకే ప్రాంతంలో డీలిమిటేషన్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం అధికారికంగా నిర్వహిస్తుంది. అందుకు సంబంధించి చేసిన చట్టంలో పలు నిబంధనలు చేర్చారు.

పీఓకేను సైనిక చర్య ద్వారా స్వాధీనం చేసుకునే సామర్థ్యం భారతదేశానికి లేకపోలేదు. కానీ బలవంతపు విలీనం భారత్‌కు ఇష్టం లేదు. ప్రత్యక్ష సైనిక దాడికి బదులుగా దౌత్యపరమైన ప్రక్రియతోను, స్థానిక ప్రజల అభీష్టం మేరకే ఈ అంశాన్ని పరిష్కరించాలని భారత్ భావిస్తోంది. జమ్మూ కశ్మీర్‌లో ప్రస్తుతం జరుగుతున్న ఆర్థిక సామాజిక అభివృద్ధి కారణంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ చివరకు స్వచ్ఛందంగా భారత్‌లో విలీనం కోరవచ్చని ఇటీవల కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టం చేశారు. ఆక్రమిత భూభాగంలో పౌర అశాంతి కారణంగా విలీనం చేసుకుంటే కొన్ని సమస్యలు ఎదురవుతాయన్న వాస్తవం భారత్‌కు తెలుసు. పీఓకే అంశంపై ఇప్పటికే భారత్... ఐక్యరాజ్య సమితికి ఫిర్యాదు చేసి, న్యాయం కోసం దౌత్యపరమైన ఒత్తిడి తెస్తోంది. అలాగే దాదాపు 45 లక్షల సంఖ్యలో ఉన్న జనాభాను నిర్వహించడమనేది, వారి పూర్తి అంగీకారం లేకుండా సజావుగా జరిగే పని కాదు.

పీఓకేను వదులుకోవడం మొదటి నుంచి పాకిస్థాన్‌కు ఇష్టం లేదు. అనుకూలమైన భౌగోళిక పరిస్థితుల కారణంగా అక్కడి నుంచి తమ మిలిటెంట్లను భారత భూభాగంలోకి పంపడం వారికి తేలిక కనుక ఎట్టి పరిస్థితులలోనూ పీఓకేను వదులుకోవడానికి పాకిస్థాన్ సిద్ధంగా లేదు. ఈ కారణంగానే, ఒకవైపు పీఓకేలో తిరుగుబాటును సైనిక చర్య ద్వారా అణచివేస్తూ, మరోవైపు ఇతర ఇస్లామిక్ దేశాల మద్దతు కోరుతోంది. అంతేకాకుండా చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ పీఓకే భూభాగంతో అనుసంధానమై ఉన్నందున.. పీఓకే విషయంలో భారత్ ఏ మాత్రం తొందరపడినా చైనా జోక్యం తప్పదని పాకిస్థాన్ నమ్ముతోంది.

పీఓకేలో ప్రస్తుతం సాగుతున్న ఆందోళనలు పరాకాష్ఠకు చేరితే వాటిని నియంత్రించడం పాకిస్థాన్‌కు సాధ్యం కాదు. ప్రస్తుతం దేశ అంతర్గత సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌కు పీఓకే పెద్ద తలనొప్పిగా తయారైంది. అంతర్జాతీయ సమాజంలో పాకిస్థాన్ ప్రతిష్ఠ నానాటికీ దిగజారిపోతోంది. పొరుగున తాలిబన్ల ఆధీనంలో ఉన్న ఆఫ్ఘానిస్థాన్‌తో కూడా పాకిస్థాన్ సఖ్యతగా లేదు. బంగ్లాదేశ్‌లోని కొత్త ప్రభుత్వంతో అనుకూలంగా ఉంటున్నప్పటికీ పాకిస్థాన్‌కు అక్కడి మెజారిటీ ప్రజల మద్దతు లేదు. చైనా ఒక్కటే వివిధ స్వప్రయోజనాల రీత్యా పాక్‌కు ఆపన్న హస్తం అందిస్తోంది.

ఇప్పటికిప్పుడు పీఓకే భారత్‌లో విలీనం అవుతుందని భావించలేము. పీఓకేను బలవంతంగా స్వాధీనం చేసుకొనే అవకాశం కూడా లేదు. ఒకవేళ భవిష్యత్తులో పీఓకే కనుక భారత్‌లో విలీనం అయితే తప్పనిసరిగా భారత్‌కు అనేక ప్రయోజనాలు ఒనగూరుతాయి. ప్రత్యేకించి వ్యూహాత్మక, ఆర్థిక, భద్రత, ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది. మధ్య ఆసియా దేశాలకు భూమార్గం సుగమం కావడం, పాకిస్థాన్ నుంచి వచ్చే చొరబాటుదార్లను నిరోధించడం సాధ్యపడతాయి. ప్రధానంగా పాక్-చైనాల ఎకనామిక్ కారిడార్ పనులు నిలిచిపోయి పాకిస్థాన్ ఆర్థికంగా, రాజకీయంగా మరింత బలహీనపడుతుంది.

ప్రస్తుతం యావత్ ప్రపంచ దృష్టి ఇరాన్-అమెరికా యుద్ధంపైనే ఉండటం వల్ల పీఓకేలో వేగంగా చోటు చేసుకుంటున్న పరిణామాలు అంతర్జాతీయ సమాజం దృష్టిని పెద్దగా ఆకర్షించడం లేదు. అయితే, ఇటీవల జెనీవాలో పీఓకే మద్దతుదారులు నిర్వహించిన భారీ ప్రదర్శనతో పీఓకేలో జరుగుతున్న మానవహక్కుల హననంపై యునైటెడ్ నేషన్స్ దృష్టి సారించింది. జమ్మూ కశ్మీర్ అంశంలో నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న కొన్ని అసాధారణ నిర్ణయాలు ప్రస్తుతం సానుకూల పరిస్థితులను ఏర్పరిచాయి. జమ్మూ కశ్మీర్‌లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు, సంపద పెరిగి స్థూల రాష్ట్ర ఉత్పత్తి పెరిగింది. అన్నిటికంటే ముఖ్యంగా అక్కడ ప్రశాంత వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజల జీవన ప్రమాణాలు పెరగడంతో సహజంగానే పీఓకే ప్రజలు జమ్మూ కశ్మీర్‌లో అంతర్భాగం కావాలని భావిస్తున్నారు. మెజారిటీ ప్రజల మద్దతు కోల్పోయిన తర్వాత పీఓకేలో పాకిస్థాన్ పట్టు ఎంతోకాలం నిలబడదు. అయితే అదెంత కాలం అన్నదే ప్రశ్న?

# అమ్మభాషలో చదువుకు ఏఐ దన్ను

**ప్రతి మనిషీ అమ్మానాన్న, తోబుట్టువులూ, బంధువులూ, తోటివారితో మాట్లాడే భాషలోనే ప్రకృతినీ సమాజాన్నీ సంస్కృతినీ అర్థం చేసుకుంటాడు. మాతృభాష మనిషికి బలమైన వ్యక్తిత్వాన్ని, జీవన నైపుణ్యాలను అందిస్తుంది. ఆత్మస్థైర్యాన్ని నింపుతుంది. కానీ ఇంటి భాష, బడి బాష వేరువేరయ్యే సరికి గందరగోళం ఏర్పడుతోంది. ఫలితంగా ఏదీ అర్థంకాక, అన్నింటా వెనకబడాల్సి వస్తోంది.మానవ సంబంధాలను ఏర్పాటు చేసుకోవడానికి, సంపద సృష్టితో జీవనం సాగించడానికి మాతృభాష ముఖ్య ఉపకరణంలా పనిచేస్తుంది. మనిషికి జీవించే హక్కు పుట్టుకతో ఎలా వస్తుందో, గౌరవప్రదమైన జీవనానికి వారసత్వంగా వచ్చిన మాతృభాషలో చదువు కూడా అలాంటిదే. అంటే, ఇప్పటి ఆంగ్ల మాధ్యమంతో ఆ ప్రజాస్వామిక హక్కును కోల్పోతున్నామన్నమాటే! ఆంగ్ల మాధ్యమం పేరిట ప్రస్తుత, రాబోయే తరాలకు మాతృభాషను దూరం చేయడం వల్ల తెలుగు సమాజానికి జరిగే నష్టాల గురించి తీవ్రంగా ఆలోచించాల్సిన సమయమిది. అవసరానికి ఏ భాషనైనా ఒక విషయంగా నేర్చుకోవచ్చు. కానీ ఇంగ్లిష్ మాధ్యమ విద్య ద్వారా తెలుగు తరిగిపోతోంది. దీనివల్ల వ్యక్తికీ, సమాజానికీ జరుగుతున్న నష్టాల గురించి తెలుసుకోవాలి. యువతలో నైపుణ్యాల లేమితో ఇబ్బందిపడుతున్న పరిశ్రమల గురించీ, అక్షరాస్యతలో వెనకబాటుతనం, పెరుగుతున్న నేరప్రవృత్తుల గురించీ యోచించాలి. మాతృభాషలో చదువులు కుటుంబం, సమాజం పట్ల బాధ్యతతో కూడిన ప్రవృత్తిని పెంచేందుకు తోడ్పడతాయి. వృత్తి ఉద్యోగాల కోసం మార్కులే లక్ష్యంగా చదవడం వల్ల మనుషుల్లో విపరీత ధోరణులు పెరిగిపోతున్నాయి. చదువులు నేర ప్రవృత్తిని తగ్గించాలి కానీ, ఇప్పుడు సమాజంలో నేరాలు ఎక్కువవుతున్నాయి. దీని గురించి మనమొకసారి ఆలోచించాలి. ప్రపంచవ్యాప్తంగా జరిగిన కొన్ని పరిశోధనలు నేరుగా కాకపోయినా వివిధ విషయాల కలయికతో- ఒక కీలకాంశాన్ని పేర్కొంటున్నాయి. వలస పాలకుల భాషా మాధ్యమ చదువులు మానసిక, సాంస్కృతిక వేర్పాటు భావనను కలిగిస్తాయని, ఇది ప్రత్యేకించి యువతలో అసంతృప్తికి, విస్తృత సామాజిక అశాంతికి దోహదం చేస్తాయని గుర్తించాయి.**

ఆంగ్ల మాధ్యమంపై భ్రమలు

ఆంగ్ల మాధ్యమ విద్యతోనే దేశవిదేశాల్లో ఉద్యోగాలు వస్తాయనే భ్రమ బలపడింది. కానీ, ఏటా లక్షల్లో ఉద్యోగాలు రావాల్సి ఉండగా, వేలల్లోనే లభిస్తున్నాయి. విదేశీ కొలువులైతే ఎక్కువగా అమెరికా నుంచే వస్తున్నాయి. గత రెండేళ్లుగా తరిగిపోతున్న అమెరికా ఉద్యోగావకాశాలు ఇప్పుడు కనీస స్థాయికి చేరుకున్నాయి. తరుగుతున్న విదేశీ ఉద్యోగ అవకాశాలూ, పెరుగుతున్న ఆంగ్ల మాధ్యమ చదువులూ యువతలో నిరాశలను పెంచుతున్నాయి. మాతృభాష మానవ సమాజాలకు ఆర్థిక వెన్నెముక. మన ఆర్థిక వ్యవస్థ కేవలం ఇంగ్లిష్ మీద ఆధారపడి ఉందనేది అపోహ మాత్రమే. భారతదేశ మొత్తం జీడీపీలో దాదాపు 82.73శాతం వాటా మాతృభాషల్లో జరిగే ఆర్థిక కార్యకలాపాల ద్వారానే సమకూరుతోందని అంచనా. సుమారు 17.26శాతం ఆదాయం మాత్రమే ఇంగ్లిష్ వినియోగం ఉన్న రంగాల నుంచి వస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో 84.52శాతం ఆర్థిక లావాదేవీలు మాతృభాషలోనే సాగుతున్నాయి. మాతృభాషలో విద్యనభ్యసించే దేశాలైన దక్షిణ కొరియా, జపాన్, అమెరికా, చైనా, ఇజ్రాయెల్, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, రష్యా, యూకే పేటెంట్ల సాధనలో ముందంజలో ఉన్నాయి. ఇంగ్లిష్ మీడియంపై అతిగా ఆధారపడుతున్న ఇండియా చాలా వెనకంజలో ఉంది. 2011 గణాంకాల ప్రకారం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యత జాతీయ సగటుకన్నా తక్కువ. మాతృభాషలో చదువుకునే అవకాశం తగ్గడమే ఈ వెనకబాటుకు కారణం. ఇంగ్లిష్ అర్థం కాక బడిమానేసే పిల్లల సంఖ్య కూడా పెరుగుతోంది. పట్టభద్రుల్లోనూ చాలామందికి సరైన వృత్తి నైపుణ్యాలు లేవని సర్వేలు చెబుతున్నాయి. ఇదంతా ఆంగ్ల మాధ్యమంతో కలుగుతున్న సామాజిక నష్టం.

పిల్లలు ఇంట్లో అమ్మానాన్నలు, కుటుంబంలోని పెద్దలూ బంధువులూ చెప్పే కథలనూ, వారి అనుభవాలనూ మాతృభాషలో వింటూ సామాజిక వ్యక్తిత్వాన్నీ నడవడికనూ ఏర్పరచుకుంటారు. ఇంటిభాష బడిభాష వేరయ్యేసరికి పాఠ్యాంశాలు నేర్చుకునేందుకు భాషతోనే కష్టాలు మొదలవుతాయి. ఇంట్లోవారితో బంధుమిత్రులతో గడగడా అమ్మభాషలో మాట్లాడే పిల్లలు, బడిలో ఇంగ్లిష్‌లో టీచరు చెప్పే పాఠాలు పూర్తిగా అర్థంకాక భయపడతారు. ప్రశ్నించడమూ మానుకుంటారు. బడిలోని ఇంగ్లిష్ ఇంట్లోవారికి తెలియకపోవడంతో పిల్లల చదువులతో వారికెలాంటి సంబంధం లేకుండా పోతోంది. చదువులపై చర్చ కూడా ఉండటం లేదు. అటు బడిభాషా రాక, ఇటు తెలుగూ అనర్గళంగా మాట్లాడలేక అయినవారితో మాట్లాడటమూ తగ్గించుకుంటారు. దాంతో కుటుంబ, సామాజిక సంబంధాల్లో క్షీణత తలెత్తుతుంది. ఇంట్లో పెద్దవాళ్లు పంచుకోవాలనుకునే కథలూ, అనుభవాలూ సాంస్కృతిక విషయాలేవీ పిల్లలకు చేరకపోతే వారు మాతృభాషతోపాటు పుట్టిన సంస్కృతికీ, సమాజానికీ, మానవ సంబంధాలకూ దూరమవుతారు. చివరికి ఎవరి లోకంలో వారు ఉండాల్సి వస్తుంది.

**సాంకేతికత సాయంతో...**

ఆధునిక కృత్రిమ మేధ ఆధారిత యంత్రానువాద సాధనాల వల్ల విజ్ఞాన సముపార్జన ఇప్పుడు సులభమైంది. సమాచార లభ్యత తేలికగా మారింది. ప్రపంచంలో ఏ భాషలో ఉన్న సమాచారాన్ని అయినా మాతృభాషలోకి మార్చుకునే వెసులుబాటు వచ్చింది. కాబట్టి విజ్ఞానశాస్త్రం, సాంకేతిక విషయాలను మాతృభాషలోనే నేర్చుకోవచ్చు. అంతర్జాతీయ సమాచారాన్ని పొందవచ్చు. ఈ పరిణామం కృత్రిమ మేధా యుగంలో ఇంగ్లిష్ అనివార్యతను తగ్గించడంలో కీలకంగా మారుతోంది. కృత్రిమ మేధ ఆధారిత యంత్రానువాద వ్యవస్థలు నేడు ఏ భాష నుంచైనా మరో భాషకు తర్జుమా చేసుకునే వీలు కల్పిస్తున్నాయి. ప్రాచీన గ్రంథాల నుంచి ఆధునిక తెలుగుకూ మరే ఇతర భాషల్లోకైనా అనువదించుకోవడం సులభతరంగా మారింది. ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకుంటూ మాతృభాషలో జ్ఞానసముపార్జనకు నవతరానికి అవకాశం కల్పించాలి. అది కుటుంబాల శ్రేయస్సుకూ, దేశ భవిష్యత్తుకూ మేలు చేస్తుంది.

# విధ్వంసకర వరదలు ఎందుకొస్తున్నాయి?

**నేపాల్‌ను ఆకస్మిక వరదలు అతలాకుతలం చేశాయి. ఏదైనా హిమానీనదం అకస్మాత్తుగా కరిగిపోవడం వల్లే ఈ విధ్వంసం సంభవించిందేమో తెలుసుకోవాలంటే- ఆ ప్రాంత ఉపగ్రహ చిత్రాలు, ఇటీవలి వర్షపాత సమాచారాన్ని పరిశీలించాలి. ప్రాథమిక అంచనా ప్రకారం, ముప్పు తలెత్తిన ప్రాంతంలో 4.4 తీవ్రతతో కూడిన భూకంపం వల్ల హిమానీనదం అడుగున పగుళ్లు ఏర్పడి తీవ్రస్థాయిలో ఆకస్మిక వరదలు సంభవించి ఉండవచ్చని తెలుస్తోంది.అమెరికా భూగర్భ సర్వే సంస్థ తాజా అధ్యయనాలు హిమాలయ పర్వతాలలో భారీ హిమపాతం సంభవించి, కొండ చరియలు విరిగిపడటమే నేపాల్ జలప్రళయానికి కారణమని పేర్కొన్నాయి. భూకంపం వల్ల కాకుండా కొండచరియ విరిగిపడటం వల్లే భూప్రకంపన సంకేతం ఏర్పడిందని తెలిపాయి. వర్షపు నీరు కానీ, కరిగిన మంచు నీరు కానీ నేలను, మంచు దిబ్బలను అస్థిరపరచడం వల్ల ఈ విపత్తు ప్రారంభమై ఉండవచ్చు. నేపాల్-చైనా సరిహద్దులోని రసువాగఢీకి ఈశాన్యంగా ఉన్న లిండే నదిలో కొండచరియలు విరిగిపడ్డాయని నేపాల్ జాతీయ విపత్తు నిభాయింపు ప్రాధికార సంస్థ నివేదించింది. హిమాలయాల్లోని మిట్టపల్లాలు సహజంగానే ఇటువంటి ఘటనలకు తావిస్తాయి.**

ప్రమాదంలో 'మూడో ధ్రువం'

హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ) ప్రకారం, ఈ విపత్తు నేపాల్‌టిబెట్ సరిహద్దు పర్వతాల్లో ప్రారంభమైంది. భారత భూకంపాల అధ్యయన యంత్రాంగం ప్రకారం నేపాల్‌లో టిబెట్ సరిహద్దు సమీపంలోని రసువా ప్రాంతంలో భూమి కంపించింది. దీనివల్ల జిర్క్ హిమానీనదం కూలిపోయి ఉండవచ్చు. దాంతో భారీగా మంచు, మట్టి, రాళ్లు కిందకు పడి, లిండే నది సహజ ప్రవాహాన్ని అడ్డుకున్నాయి. తదనంతరం నీరు, బురద, రాళ్లు, ఇతర శిథిలాలతో కూడిన వరద త్రిశూలి నది లోయ గుండా ప్రవహించి భారీ విధ్వంసం సృష్టించింది. త్రిశూలి నారాయణి నదిలో కలుస్తుంది, అది భారత్‌లోని బిహార్ రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది, అక్కడ దీన్ని గండక్‌గా పిలుస్తారు. బిహార్, ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని గండక్ పరీవాహక ప్రాంతం నుంచి ముందుజాగ్రత్తగా వేలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మొత్తంగా నేపాల్‌లో హిమానీనదం కూలిపోవడం, ఆ తర్వాత రాళ్లతో కూడిన హిమపాతం వల్లే వరద సంభవించిందని ఉపగ్రహ చిత్ర విశ్లేషణ ధృవీకరించింది. ఇలాంటి దుర్ఘటనలను హిమానీనద సరస్సుల విస్ఫోటంతో సంభవించిన వరదలుగా పరిగణిస్తారు.

వాతావరణ మార్పులు హిందూకుష్ హిమాలయ ప్రాంతంలో హిమానీనదాలు వేగంగా కరిగిపోవడానికి దారితీస్తున్నాయి. ఆర్కిటిక్, అంటార్కిటికాల తర్వాత ప్రపంచంలోనే అత్యధిక మంచు నిల్వలను కలిగి ఉన్న ప్రాంతం హిమాలయాలే. అందుకే ఈ పర్వత ప్రాంతాన్ని ప్రపంచానికి 'మూడో ధ్రువం'గా వ్యవహరిస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కొద్దీ, నిటారుగా ఉన్న కొండవాలులపై శతాబ్దాల నాటి శాశ్వత మంచు పొరలు (పెర్మా ఫ్రాస్ట్) కరగడం ప్రారంభమై, ఆకస్మికంగా శిథిలాల ప్రవాహాలను ప్రేరేపిస్తాయి. మంచు కొండల్లో వరద ఉత్పాతాలు సంభవించడం నేపాల్‌కే పరిమితం కాదు. భారతదేశంలో ఉత్తరాఖండ్‌లో చమోలీ విపత్తు, స్విట్జర్లాండ్‌లో బ్లాటెన్ గ్రామం ధ్వంసం కావడం, జార్జియా పర్వత రిసార్ట్‌లో కొండచరియలు విరిగిపడి పలువురు ప్రాణాలు కోల్పోవడం వంటివన్నీ ప్రపంచవ్యాప్తంగా హిమానీనదాలు వేగంగా క్షీణించి పోతున్నాయనడానికి నిదర్శనం. స్విస్ హిమానీనదం బద్దలైన సమయంలో కచ్చితంగా పనిచేసిన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు సకాలంలో ప్రజలను ఖాళీ చేయించి, ప్రాణనష్టాన్ని నివారించడానికి ఉపకరించాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఇప్పుడు నదీ మట్టాలను, భారీ వర్షపాతం, భూకంప ప్రమాదాలను ముందే పసిగట్టి, నిజ సమయంలో పర్యవేక్షించవచ్చు. కానీ, అధిక వ్యయం కారణంగా ఇటువంటి వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం వర్ధమాన దేశాలకు సవాలు అవుతోంది. నేపాల్‌లో పర్యవేక్షణ సదుపాయాల ఆధునికీకరణకు నిరుడు 'గ్రీన్ క్లైమేట్ ఫండ్' నిధులను కేటాయించడాన్ని ఒక ఆశాకిరణంగా భావించవచ్చు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# కొండా దంపతుల దారెటు?

(మొదటి పేజీ తరువాయి)

కొండా సురేఖ ప్రస్తుతం వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే; మంత్రి పదవి కోల్పోయినంత మాత్రాన ఎమ్మెల్యే పదవి పోదు. ఆమె ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, దానిని ఆమోదిస్తేనే ఆ స్థానానికి ఉపఎన్నిక అవసరమవుతుంది. అయితే ఇప్పటివరకు సురేఖ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారనే అధికారిక ప్రకటన వెలువడలేదు. గతంలో కొండా కుటుంబం ఉపఎన్నికల రాజకీయాన్ని ఎదుర్కొన్న చరిత్ర ఉండటంతో ఈ ప్రచారానికి రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. మంత్రి పదవి తొలగింపును బీసీ మహిళా నాయకురాలిపై చర్యగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉందన్న చర్చ కూడా ఉంది. అయితే అది వ్యూహమా, ఒత్తిడి రాజకీయమా అన్నది రాబోయే రోజుల్లోనే తేలనుంది.

**అధిష్ఠానం అసలు చెప్పిందేమిటి?**

సురేఖను వివరణ కోరిన అనంతరం పార్టీ క్రమశిక్షణ అంశాన్ని అధిష్ఠానం తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సురేఖ కలిసి తన వాదనను వినిపించారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్‌లకు కూడా తన వివరణను తెలియజేసినట్లు ఆమె వెల్లడించారు. పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండకూడదనే సంకేతాన్ని అధిష్ఠానం ఇచ్చినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు సురేఖ మాత్రం తనపై మాత్రమే చర్య ఎందుకని ప్రశ్నిస్తూ, ఇతర నేతల వ్యాఖ్యలను కూడా పరిశీలించాలని డిమాండ్ చేశారు.

**వివాదానికి మూలం ఎక్కడ?**

సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ పరకాల రాజకీయాలపై, సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు వివాదానికి కేంద్రబిందువయ్యాయి. పరకాల సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికే వచ్చే ఎన్నికల్లో మరోసారి అవకాశం ఉంటుందని రేవంత్‌రెడ్డి ప్రకటించడం ఈ విభేదాలకు మరింత ఆజ్యం పోసింది. ఇప్పటికే పరకాల నియోజకవర్గంలో రేవూరి, కొండా వర్గాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఇక కొండా దంపతుల ముందు మూడు మార్గాలా?**

మొదటిది కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ ఎమ్మెల్యేగా రాజకీయ పోరాటం చేయడం. రెండోది ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉపఎన్నికకు వెళ్లడం. మూడోది కాంగ్రెస్ నాయకత్వంతో మరోసారి రాజీ ప్రయత్నం చేసి రాజకీయంగా నష్టాన్ని పరిమితం చేసుకోవడం. వీటిలో ఏ మార్గాన్ని ఎంచుకుంటారన్నది ప్రస్తుతం కొండా కుటుంబ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే అంశంగా మారింది. అయితే బైఎలక్షన్‌కు వెళ్లే అంశంపై ఇప్పటివరకు అధికారిక నిర్ణయం లేదన్నదే ముఖ్యమైన విషయం.

**వరంగల్‌లో రాజకీయ సమీకరణాలు మారేనా?**

సురేఖను కేబినెట్ నుంచి తప్పించిన నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ రాజకీయ సమీకరణాలు సహజంగానే మారే అవకాశం ఉంది. అదే సమయంలో బీసీ వర్గాల్లో సురేఖకు ఉన్న రాజకీయ ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యామ్నాయ సామాజిక సమీకరణాలపైనా దృష్టి పెట్టినట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. ఇక కొండా దంపతులు తీసుకునే తదుపరి నిర్ణయం కాంగ్రెస్‌కు మాత్రమే కాదు, బీఆర్ఎస్, బీజేపీలకు కూడా రాజకీయంగా ప్రాధాన్యమైన అంశంగా మారనుంది. అందుకే ఇప్పుడు అసలు ఉత్కంఠ మంత్రి పదవి పోయిందా లేదా అన్నదానిలో కాదు కొండా కుటుంబం ఎమ్మెల్యే పదవిని కొనసాగిస్తుందా, లేక ఉపఎన్నికకు సవాల్ విసురుతుందా అన్నదానిపైనే ఉంది. ప్రస్తుతానికి బర్తరఫ్ ఖరారైంది.. బైఎలక్షన్ మాత్రం ఊహాగానాల దశలోనే ఉంది.



# స్నేహంతోనే నన్ను గెలవాలి నేను ఎవరికీ గులామ్‌ను కాదు

(మొదటి పేజీ తరువాయి)

ఈ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వలేదని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి త్వరగా వంతెన పూర్తిచేసిందని చెప్పారు. తమ ప్రాంత అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఒవైసీ ప్రభుత్వంతో పోరాటానికైనా సిద్ధంగా ఉంటారన్నారు. ''ఈ ప్రాంతమంతా ఓల్డ్ సిటీ కాదు.. ఇది ఒరిజినల్ సిటీ. పాతబస్తీలో అణువణువూ నాకు తెలుసు. మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. అది పూర్తయితే పర్యాటకంగా, రవాణాపరంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పటికే ఆరాంఘర్, మూసారాంబాగ్ వంతెనల నిర్మాణం పూర్తిచేశాం. పాతబస్తీ మెట్రోను పూర్తిచేస్తామని చెప్పాం.. చేసి చూపిస్తాం. నాలాలపై ఆక్రమణలను తొలగించి మురుగు సమస్య లేకుండా చేస్తాం. ఎక్కడైనా పేదల ఇళ్లు తొలగిస్తే.. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటాం. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. ప్రతి నెలా రేషన్‌కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం''అని రేవంత్ అన్నారు.

**రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతు: అసదుద్దీన్**

అంతకుముందు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తామని చెప్పారు. సీఎం రేవంత్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలన్నారు. రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఆయన తనదైన పంథాలో పరిపాలన చేయాలన్నారు.

# రాఘవ్ చడ్డాకు ఓటర్ లిస్ట్ షాక్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 03, అనంతజనశక్తి న్యూస్

రాజ్యసభ ఎంపీ, ఆమ్ ఆద్మీ పార్టీ  మాజీ నేత రాఘవ్ చడ్డా పేరు పంజాబ్ డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ నుంచి తొలగించడం రాజకీయ దుమారం రేపుతోంది. ఆయన ప్రస్తుతం బీజేపీ పార్టీలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పంజాబ్‌లో నిర్వహించిన ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్  ప్రక్రియలో ఆయన పేరును 'షిఫ్టెడ్'గా పేర్కొన్నట్లు రాఘవ్ చడ్డా తాజాగా వెల్లడించారు. తన ఓటర్ ఐడీ పంజాబ్‌లోని మొహాలీలో రిజిస్టర్ అయి ఉన్నప్పటికీ ఇలా ఎలా చేశారంటూ ఆయన ప్రశ్నించారు.

**'ఇది క్లరికల్ మిస్టేక్ కాదు'**

తన పేరు ఓటర్ లిస్ట్ నుంచి తొలగించడంపై రాఘవ్ చడ్డా తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం అధికారుల స్థాయిలో జరిగిన పొరపాటు కాదని, రాజకీయ కక్ష సాధింపు చర్యగా కనిపిస్తోందని చెప్పుకొచ్చారు. తాను పంజాబ్ నుంచి ప్రస్తుత రాజ్యసభ సభ్యుడినని, తన ఓటర్ ఐడీ మొహాలీలోనే ఉందని స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం ఉన్నది డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ మాత్రమేనని, తుది జాబితా కాదని చడ్డా తెలిపారు. క్లెయిమ్స్, ఆబ్జెక్షన్స్ ప్రక్రియలో తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఉందని, SIR మార్గదర్శకాల ప్రకారం అందుబాటులో ఉన్న పరిష్కారాలను ఇప్పటికే వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. తుది ఓటర్ జాబితా అక్టోబర్‌లో విడుదల కానుందని అధికారులు తెలిపారు. ఓటర్ లిస్ట్ తయారీ ప్రక్రియలో బూత్ లెవల్ ఆఫీసర్  నుంచి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (, డిస్ట్రిక్ట్ ఎలక్షన్ ఆఫీసర్  వరకు వివిధ స్థాయిల్లో అధికారులు పనిచేస్తారని చడ్డా తెలిపారు. ఇంతటి వ్యవస్థ ఉన్నప్పుడు తన పేరును 'షిఫ్టెడ్'గా ఎలా గుర్తించారనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు.

ప్రజాప్రతినిధుల విషయంలో ఎన్నికల మార్గదర్శకాల్లో ప్రత్యేక జాగ్రత్తలు ఉండాలని, తన విషయంలో ఆ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టినట్లు అనిపిస్తోందని ఆయన ఆరోపించారు. పంజాబ్ డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ అధికార పార్టీకి చెందిన వ్యక్తిగత ఆస్తి కాదని ఆయన వ్యాఖ్యానించారు. తాను ఆమ్ ఆద్మీ పార్టీని వీడి బీజేపీలో చేరిన తర్వాత ఆ పార్టీ నేతల్లో తనపై ఆగ్రహం పెరిగిందని రాఘవ్ చడ్డా చెప్పుకొచ్చారు. తనతో పాటు పార్టీని వీడిన ఇతర నేతలను కూడా పంజాబ్ ప్రభుత్వం టార్గెట్ చేస్తోందని విమర్శించారు. తన పేరు ఓటర్ లిస్ట్ నుంచి తొలగించడం కూడా రాజకీయ కక్షలో భాగమని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను AAP ఖండించింది. SIR ప్రక్రియ ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరుగుతుందని, ఓటర్ జాబితాలో ఎవరి పేరు ఉండాలి, ఎవరి పేరు తొలగించాలనే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి నిర్ణయాధికారం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ స్పష్టం చేసింది. రాఘవ్ చడ్డా పేరు తొలగింపు వ్యవహారం ఇప్పుడు పంజాబ్ రాజకీయాల్లో వివాదానికి దారితీసింది. డ్రాఫ్ట్ జాబితాలో చోటుచేసుకున్న ఈ మార్పు తుది జాబితాలోనూ కొనసాగుతుందా? లేక క్లెయిమ్స్, ఆబ్జెక్షన్స్ ప్రక్రియలో ఆయన పేరు తిరిగి చేరుతుందా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# సరస్వతిగూడలో మల్బరీ సాగు, పట్టు పరిశ్రమపై అవగాహన సదస్సు

- సరస్వతిగూడ గ్రామ పంచాయతీ సర్పంచ్  గిరిజ విష్ణువర్ధన్ రెడ్డి
- ముఖ్య అతిథులుగా సెరికల్చర్ ఏడీ మహిపాల్ సెరికల్చర్ సైంటిస్ట్ నందన్
- మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ *కంబాలపల్లి విష్ణువర్ధన్ రెడ్డి




కందుకూరు, సెప్టెంబర్ 03,( అనంత జనశక్తి )

మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రం సరస్వతిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ గిరిజ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో, సెరికల్చర్ (పట్టు పరిశ్రమ) శాఖ ఆధ్వర్యంలో మల్బరీ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెరికల్చర్ ఏడీ మహిపాల్ సెరికల్చర్ సైంటిస్ట్ నందన్ మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంబాలపల్లి విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్బరీ పండు వల్ల గుండె జబ్బులు రాకుండా ఉంటాయని, గుండెకు రక్త ప్రసరణ బాగా జరుగుతుందని, జీర్ణక్రియ సజావుగా జరగడానికి ఎంతో దోహదపడుతుందని, ఇంకా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు.మల్బరీని కేవలం పండ్ల కోసమే కాకుండా, పట్టు పురుగుల పెంపకానికి వినియోగిస్తే రైతులకు అధిక లాభాలు వస్తాయని అన్నారు. పట్టు పురుగుల పెంపకానికి ప్రభుత్వం షెడ్ల నిర్మాణానికి, మల్బరీ తోటలకు డ్రిప్ పరికరాలకు సబ్సిడీ అందిస్తోందని, రైతులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం పొలాల్లోకి వెళ్లి తెగుళ్లు సోకిన మల్బరీ చెట్లను పరిశీలించి, వాటికి అవసరమైన మందులను సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ ఢిల్లీ శ్రీధర్, రైతులు కాల్వ శ్రీనివాస్, కంబాలపల్లి రాజిరెడ్డి, బుసరమోని యాదగిరి, అంజయ్య, రజనీకాంత్, కళ్యాణ్, మల్లేష్, కంబాలపల్లి కరుణాకర్ రెడ్డి, పాండురంగారెడ్డి, గోపిరెడ్డి రవీందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, కాల్వ ఇంద్రసేన, దర్శన్, మల్లెపు శ్రీను, బసరమోని జంగయ్య, మాదారమోని శ్రీరాములు, జంగయ్య, బుసరామోని రఘు, సత్యం, జస్వంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు దశాబ్దాల ఎదురుచూపులకు తెర

- సర్వేపల్లి కాలువకట్ట నిర్వాసితులకు శాశ్వత పట్టాలు
- 1,215 పేద కుటుంబాలకు ఊరట.
- ఆమోదం తెలిపిన క్యాబినెట్.
- నెల రోజుల్లోనే మాట నిలబెట్టుకున్న మంత్రి నారాయణ
- త్వరలో  పట్టాల పంపిణీ పండుగ.
- కల సాకారం చేసిన సీఎం చంద్రబాబు,మంత్రి నారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం.



నెల్లూరు సెప్టెంబర్ 03 అనంత జనశక్తి న్యూస్

ఆరు దశాబ్దాలుగా వెంటాడుతున్న భయం.. అనిశ్చితి.. కన్నీళ్లకు ఇక తెరపడనుంది. సర్వేపల్లి కాలువకట్టపై నివసిస్తున్న నిర్వాసితుల 60 ఏళ్ల సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. 1,215 పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు మంజూరు చేసేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో కాలువకట్టపై సంబరాలు అంబరాన్నంటాయి.పట్టాలు ఇప్పిస్తానని నెల రోజుల క్రితం హామీ ఇచ్చిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.సంకల్పం గట్టిదైతే సాధించలేనిది ఏదీ లేదని మరోసారి నిరూపించారు. మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలను సమన్వయ పరిచి అధికారిక ప్రక్రియను వేగవంతం చేసి క్యాబినెట్ ఆమోదం సాధించారు. త్వరలోనే నిర్వాసితులకు శాశ్వత పట్టాలు పంపిణీ చేయనున్నారు.

కాలువకట్టపై నివాసాలు తొలగిస్తారన్న ప్రచారం జరిగిన ప్రతిసారీ నిర్వాసితులు వణికిపోయేవారు. ఎప్పుడు తమ ఇళ్లు ఖాళీ చేయాల్సి వస్తుందోనన్న భయంతో నిద్రలేని రాత్రులు గడిపారు. సొంత ఇంట్లోనే హక్కు లేని పరిస్థితి..భవిష్యత్తుపై భరోసా లేని జీవితం..ఇలా ఐదు దశాబ్దాలు గడిచిపోయాయి. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. మంత్రి నారాయణ ప్రత్యేక దృష్టి సారించడంతో పరిస్థితి మారింది. గత నెల 8 వ తేదీన కాలువకట్టపై పర్యటించిన మంత్రి సమస్యను స్వయంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పేదల ఇళ్లకు శాశ్వత భద్రత కల్పించడంలో మరో మైలురాయిని అధిగమించారు. తొలుత భగత్‌సింగ్ కాలనీలో 1,400 కుటుంబాలకు శాశ్వత పట్టాల సమస్యకు పరిష్కారం చూపిన మంత్రి.. ఇప్పుడు సర్వేపల్లి కాలువకట్టపై మరో 1,215 కుటుంబాలకు పట్టాల మార్గం సుగమం చేశారు.రెండు ప్రాంతాల్లో కలిపి వేలాది కుటుంబాలకు శాశ్వత భరోసా కల్పించడం ద్వారా పేదల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుందని స్థానికులు చెబుతున్నారు.

నాలుగు ప్రాంతాల్లో పండుగ వాతావరణం

క్యాబినెట్ ఆమోదం వార్త తెలియగానే లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు,స్టోన్ హౌస్ పేట ఉడ్‌హౌస్ సంగం, బాలాజీనగర్ అన్నపూర్ణ అపార్ట్మెంట్ ఎస్ఎస్ చికెన్ సెంటర్,శెట్టిగుంటరోడ్ ప్రాంతాల్లో సంబరాలు నిర్వహించారు.సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ ,డీసీఎం పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు చేసి పూలవర్షం కురిపించారు.స్వీట్లు పంచిపెట్టారు. రంగులు చల్లుకుని,బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు.దాంతో కాలువకట్ట ప్రాంతమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది.

60 ఏళ్లుగా మమ్మల్ని పట్టించుకునేవారు లేరు. ఇళ్లు తొలగిస్తారన్న వార్త వచ్చిన ప్రతిసారీ భయంతో బతికాం. ఇప్పుడు మా పిల్లల భవిష్యత్తుకు భరోసా వచ్చింది. శాశ్వత పట్టాలు ఇప్పిస్తానని చెప్పి నెల రోజుల్లోనే హామీ నిలబెట్టుకున్న మంత్రి నారాయణకు ఆజన్మాంతం రుణపడి ఉంటాం" అంటూ నిర్వాసితులు భావోద్వేగానికి గురయ్యారు.పేదల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపిస్తోందని ఈ పరిణామం మరోసారి నిరూపించింది. సమస్యను గుర్తించడం నుంచి శాఖల సమన్వయం, క్యాబినెట్ ఆమోదం వరకు మంత్రి నారాయణ ప్రత్యేక శ్రద్ధ చూపారు.టీడీపీ అంటే మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం" అని మరోసారి రుజువైందని స్థానిక టీడీపీ నాయకులు పేర్కొన్నారు.రెండు తరాల నిరీక్షణ తర్వాత సర్వేపల్లి కాలువకట్ట కథలో కొత్త అధ్యాయం మొదలైందంటున్నారు.ఆరు  దశాబ్దాల నిరీక్షణకు తెరదించి, 1,215 కుటుంబాలకు శాశ్వత భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.పాలాభిషేక కార్యక్రమంలో కాలువకట్ట నిర్వాసితులతో పాటు నగర మేయర్ దేవరకొండ సుజాత,రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ,నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు,కార్పొరేటర్లు కర్తం ప్రతాప్ రెడ్డి,కిన్నెర మాల్యాద్రి,వెంకటేశ్వర రెడ్డి,టీడీపీ నాయకులు సాయిరాం,పెంచల చౌదరి,ఆంచూరు శ్రీనివాసులు,బీసీ బాబు,తిరుమల నాయుడు,కొండా ప్రవీణ్,అన్నపూర్ణ,ఇంతియాజ్ ,జహీర్,మొయినుద్దీన్ ,జనసేన నేత గుణుకుల కిషోర్ ,మార్కెటింగ్ కమిటీ మెంబెర్ గుణుకుల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# లేట్ డెత్ సర్టిఫికెట్ల జారీకి చర్యలు

- 17 దరఖాస్తుల్లో 12 మందికి సర్టిఫికెట్లు అందజేత
- జాయింట్ కలెక్టర్‌కు గ్రామస్తుల ప్రత్యేక ధన్యవాదాలు

అనంతగిరి, అనంత జన శక్తి న్యూస్, సెప్టెంబర్ 3:

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ పరిధిలోని బూరుగ, చిన్నకోనెల రెవెన్యూ గ్రామాలకు చెందిన 17 కుటుంబాలకు లేట్ డెత్ సర్టిఫికెట్ల జారీకి అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 17 కుటుంబాలు రొంపిల్లి సచివాలయంలో లేట్ డెత్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోగా, ఇప్పటివరకు 12 కుటుంబాలకు సర్టిఫికెట్లు జారీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

గతంలో పలుమార్లు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ సర్టిఫికెట్లు జారీ కాకపోవడంతో సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయడంతో పాటు ధర్నా నిర్వహించారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ స్వయంగా గ్రామానికి చేరుకుని గ్రామ పెద్దల సమక్షంలో విచారణ చేపట్టారు.

జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, వీఆర్వో నాగేశ్వరరావు ద్వారా లేట్ డెత్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను చేపట్టారు. ఈ మేరకు 12 కుటుంబాలకు సర్టిఫికెట్లు అందజేయడం జరిగిందని గ్రామస్తులు పేర్కొన్నారు. మిగిలిన దరఖాస్తుదారులకు కూడా త్వరితగతిన సర్టిఫికెట్లు అందించాలని వారు కోరారు. ఇప్పటికే 12 సర్టిఫికెట్లు జారీ చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ జాయింట్ కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన ఐదు దరఖాస్తులకు కూడా తక్షణమే లేట్ డెత్ సర్టిఫికెట్లు జారీ చేయాలని గ్రామ పెద్దలు అధికారులను కోరారు.

ఈ సందర్భంగా గ్రామ పెద్దలు సోముల అప్పలరాజు (మాజీ వార్డు సభ్యుడు), కోటపర్తి సింహాచలం, బూరుగ పెంటయ్య, బద్నాని శంకర్రావు తదితరులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



## పుట్టపర్తిని మోడల్ ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధుల ఉన్నతస్థాయి సమీక్ష

పుట్టపర్తి,సెప్టెంబర్,03:అనంత జనశక్తి న్యూస్

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, పుట్టపర్తి శాసనసభ్యురాలు మరియు మాజీ మంత్రివర్యులు లతో కలిసి పుట్టపర్తి పురపాలక సంఘ పరిధిలో మౌలిక సదుపాయాలు, తాగునీటి సరఫరా మరియు పారిశుధ్య నిర్వహణపై సమగ్ర ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పుట్టపర్తి అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రాముఖ్యత పొందిన దృష్ట్యా, ఈ ప్రాంతాన్ని పరిశుభ్రమైన, ఆధునికమైన మోడల్ నగరంగా మార్చేందుకు స్పష్టమైన ప్రణాళికను ఖరారు చేశారు.పుట్టపర్తిని పూర్తిగా "సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత", "స్టాగ్నెంట్ వాటర్ (నిల్వ నీరు) రహిత" మరియు "చెత్త రహిత పురపాలక సంఘంగా" తీర్చిదిద్దేందుకు కాలపరిమితితో కూడిన కార్యాచరణ సిద్ధం చేశారు.ప్రతి ఇల్లు మరియు వాణిజ్య సముదాయాల నుంచి తడి, పొడి చెత్తను తప్పనిసరిగా 100% వేర్వేరుగా సేకరించాలి. దీని కోసం ప్రత్యేకంగా కంపార్ట్‌మెంట్లు ఉన్న వాహనాలను మాత్రమే వినియోగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.వర్షాకాలం దృష్ట్యా వెంటనే డ్రెయిన్లలో పూడికతీత పూర్తి చేయాలని, రహదారులపై ఉన్న గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేయాలని ఆదేశించారు. పట్టణంలో నిరంతరాయంగా ఫాగింగ్, దోమల నివారణ స్ప్రేయింగ్ చేపట్టాలి. వాణిజ్య ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో ఉండేలా "జంట చెత్తబుట్టల" ను ఏర్పాటు చేయాలి. అన్ని వార్డులకు సురక్షితమైన తాగునీటిని క్రమం తప్పకుండా సరఫరా చేయాలని, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (STP) రోజువారీగా పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని సూచించారు. పుట్టపర్తికి వచ్చే వేలాది మంది భక్తులు, పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రాధాన్యమని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తికాకపోతే లేదా పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమములో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, పుట్టపర్తి మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసులు,పబ్లిక్ హెల్త్ నరసింహ మూర్తి , మైన్స్ ఏడీ, మున్సిపల్ మరియు పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# దొంగ మాఫియాకు తగిన శాస్తి

రాయదుర్గం సెప్టెంబర్ 3 అనంత జనశక్తి న్యూస్

:( డి.హిరెహాల్ ) మండల పరిధిలోని దొడగట్ట మట్టి మాఫియా దొంగలకు తగిన శాస్తి జరిగిందని భారత జాతీయ కాంగ్రెస్ రాయదుర్గం నియోజకవర్గం కన్వీనర్ గౌని ప్రతాపరెడ్డి అన్నారు. గురువారం ఆయన పత్రిక ప్రకటన ద్వారా మాట్లాడుతూ వారం రోజుల్లో విప్లవం రావడమంటే ప్రజల్లో చైతన్యం పెరుగుతోందని అర్థం.



దొడగట్టలో దొంగలు పడ్డారు, చెరువును చెరపట్టారు. మట్టి మాఫియా ముదిరిపోయి కర్ణాటకకు మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అలాంటి వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పి నేను గత పది రోజుల క్రితం పిలుపునిస్తే, దొడగట్ట దొంగలే నాపై విరుచుకుపడుతూ రైతుల కోసం మట్టి తీసుకుంటున్నామని అపప్రచారం ఆపాలని ఒత్తిడి చేసి, ఇన్ ఫార్మర్ ని ఇబ్బంది పెట్టాలని చూశారు. పరిశీలించి చూస్తే  దొడగట్టలో వారం రోజుల్లోనే విప్లవం స్టార్ట్ అయింది. నిన్నటి రోజున 60 నుండి 70 మందికి పైగా గ్రామస్తులు దొడగట్ట చెరువులో జరుగుతున్న దొంగతనాన్ని ఆపాలని మైనింగ్ మాఫియా వారిని మందలించి అక్కడ నుంచి వెళ్ళగొట్టడం జరిగినది. అందుకు దొడగట్ట గ్రామ ప్రజలందరికీ పేరు పేరునా నా కృతజ్ఞతాభివందనాలు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా జరుగుతున్న అవినీతి అరాచకాలకు అడ్డుకట్ట వేసే విధంగా ప్రజల్లో స్పందన రావాలని, వారు సొంతంగా స్పందించలేని పక్షంలో జిపిఆర్ హెల్ప్ లైన్ నెంబర్ అయిన 7386566233  నెంబర్ కి ఫోన్ చేసి ఇన్ఫర్మేషన్ ఇవ్వాలని రాయదుర్గం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ గౌని ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు.



## సివిల్ సర్వీసెస్ క్రీడా ఎంపిక పోటీలు

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్**

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్స్ 202526కు సంబంధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయి ఎంపిక పోటీలు గురువారం పాల్వంచలో నిర్వహించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ, హైదరాబాద్ ఆదేశాల మేరకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించినట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం. పరంధామ రెడ్డి తెలిపారు. పాల్వంచ మినీ స్టేడియంలో అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, యోగా, కబడ్డీ, పవర్ లిఫ్టింగ్, ఖోఖో తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. విద్యుత్ కళాభారతి, కేటీపీఎస్‌లో షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలు జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సుమారు 80 మంది ఉద్యోగులు పోటీల్లో పాల్గొనగా, ప్రతిభ కనబరిచిన 40 మంది ఉద్యోగులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అధికారి తెలిపారు.

## భూ సర్వే పనులను సకాలంలో పూర్తి చేయాలి





**- రెవెన్యూ అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష**
**- అధికారులకు కీలక సూచనలు చేసిన లోకేశ్‌కుమార్**

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్:**

తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేశ్‌కుమార్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఉన్నతస్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు ఐడీఓసీకి చేరుకున్న లోకేశ్‌కుమార్, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి (రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్) రాజీవ్‌గాంధీ హనుమంతుకు కలెక్టర్ అంకిత్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూల మొక్కలను అందజేశారు. అనంతరం ఐడీఓసీలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధికారులతో భూ సర్వే, సాదా బైనామాలు, రెవెన్యూ సదస్సులు తదితర అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాల్లో కొనసాగుతున్న రెవెన్యూ కార్యక్రమాల పురోగతిని అధికారులు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూముల రీసర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని లోకేశ్‌కుమార్ అధికారులకు సూచించారు. భూ సంబంధిత సమస్యలను పరిష్కరించడంతో పాటు, ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు.

ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్‌తో పాటు ఉమ్మడి జిల్లాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శిరీష కుటుంబానికి జనసేన అండ



**- కేసును సీబీఐకి అప్పగించాలి: తనీష్**
**- న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం**

**అశ్వరావుపేట, సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్:**

హైదరాబాద్ తుక్కుగూడలో హత్యకు గురైన ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన యువతి శిరీష కుటుంబాన్ని జనసేన పార్టీ నాయకుడు, సినీహీరో తనీష్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిరీష మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు కేసును సీబీఐకి అప్పగించాలని తనీష్ డిమాండ్ చేశారు. కేసు దర్యాప్తులో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా అన్ని అంశాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. అలాగే శిరీష కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో సంబంధిత ఆస్పత్రి పేరును చేర్చాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఆస్పత్రి యాజమాన్యం ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆర్థిక సాయం అందించకపోతే ఆస్పత్రి ఎదుట తానే స్వయంగా బైఠాయించి నిరసన చేపడతానని తనీష్ హెచ్చరించారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు జనసేన పార్టీ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా అవసరమైన అన్ని విధాలుగా పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు.

## టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అరెస్ట్.. ఆస్తులు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే!

సూర్యాపేట: టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సోమయ్యను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆయన ఇళ్లలో గురువారం సోదాలు చేపట్టారు. సోమయ్య కార్యాలయంతో పాటు బంధువులు, అనుచరులకు చెందిన 7 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. సోదాల్లో భారీగా ఆస్తుల డాక్యుమెంట్లు, నగదు, బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నారు. సోమయ్యకు చెందిన 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి, సూర్యాపేట, హయత్‌నగర్ పరిధిలో 5 రెసిడెన్షియల్ ప్రాపర్టీలను గుర్తించారు. వీటిలో జీ+1, జీ+2, జీ+4+పెంట్‌హౌస్ భవనాలతో పాటు రెండు గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు ఉన్నాయి. 8 ఓపెన్ ప్లాట్లు, రూ.4.63 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.13 లక్షల బ్యాలెన్స్, 709 గ్రాముల బంగారం, 1,750 గ్రాముల వెండి, రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు, ఇంట్లో రూ.11 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్యాంకులో 66 తులాల బంగారం తాకట్టు పెట్టి రూ.49 లక్షల గోల్డ్ లోన్ ఉన్నట్లు గుర్తించారు. ఏసీబీ లెక్కల ప్రకారం మొత్తం ఆస్తుల విలువ రూ.3,54,36,490 అని తేల్చారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ భారీగా ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు. సోమయ్య ఆస్తులపై ఏసీబీ మరింత లోతుగా విచారణ కొనసాగిస్తోంది. నిందితుడిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు.

# మహబూబ్‌నగర్ అభివృద్ధికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో కొత్త అధ్యాయం

**- 75 ఏళ్ల ప్రజల కల సాకారం దిశగా అడుగులు.. రూ.603 కోట్లతో యూజీడీ ప్రాజెక్టుకు శంకుస్థాపన**

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 03**
**అనంత జనశక్తి న్యూస్**



మహబూబ్‌నగర్ పట్టణ అభివృద్ధిలో 2026 సంవత్సరం చారిత్రాత్మకంగా నిలిచిపోనుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఓబీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి. నరసింహ నాయుడు అన్నారు. నగర ప్రజల 75 ఏళ్ల చిరకాల ఆకాంక్ష అయిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుకు రూ.603 కోట్ల భారీ నిధులతో శంకుస్థాపన జరగడం అభివృద్ధిలో కీలక మైలురాయిగా పేర్కొన్నారు.మహబూబ్‌నగర్‌ను ఆధునిక, సుందర నగరంగా తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్ ముదిరాజ్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్‌తో పాటు 60 డివిజన్ల కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో మహబూబ్‌నగర్ నగరంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు పూర్తయితే నగర పారిశుధ్యం మెరుగుపడి, ప్రజల జీవన ప్రమాణాలు పెరగడంతో పాటు నగర అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక ప్రాజెక్టుకు శంకుస్థాపన మాత్రమే కాదని, మహబూబ్‌నగర్ భవిష్యత్తుకు వేసిన బలమైన పునాది అని నరసింహ నాయుడు అన్నారు. నగర అభివృద్ధి ప్రతి ఒక్కరి లక్ష్యంగా, బాధ్యతగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తున్నందుకు గర్వంగా ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహబూబ్‌నగర్ నగర అభివృద్ధి మరింత వేగంగా కొనసాగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 19వ డివిజన్ వెంకటేశ్వర కాలనీకి చెందిన తాను గతంలో 1వ వార్డు నుంచి ప్రజా సేవలో కొనసాగుతున్నానని నరసింహ నాయుడు పేర్కొన్నారు.

### అమోర్ హాస్పిటల్స్‌లో 'మేక్ ఇన్ ఇండియా' ఎస్ఎస్ఐ మంత్ర రోబోటిక్ సిస్టమ్‌తో

# మూత్రపిండాల ట్యూమర్ శస్త్రచికిత్స విజయవంతం

**- 62 ఏళ్ల బాధితుడికి రోబోటిక్ సాయంతో రాడికల్ నెఫ్రెక్టమీ; మూడో రోజే డిశ్చార్జ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 3,అనంత జనశక్తి న్యూస్**



హైదరాబాద్‌లోని అమోర్ హాస్పిటల్స్ వైద్యులు 62 ఏళ్ల వ్యక్తికి ఎడమ మూత్రపిండంలో (కిడ్నీ) ఉన్న ట్యూమర్‌ను తొలగించేందుకు రోబోటిక్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. సర్జరీ అనంతరం వేగంగా కోలుకున్న సదరు పేషెంట్, శస్త్రచికిత్స జరిగిన మూడో రోజే పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యారు.

హైదరాబాద్‌కు చెందిన సురేష్ అనే పేషెంట్ కడుపునొప్పితో అమోర్ హాస్పిటల్‌ను సంప్రదించారు. వైద్యులు సీటీ స్కాన్ సహా పలు పరీక్షలు నిర్వహించగా ఎడమ కిడ్నీలో ట్యూమర్ ఉన్నట్లు తేలింది. వైద్య పరీక్షలు, ముందస్తు జాగ్రత్తల అనంతరం, ట్యూమర్ ఉన్న కిడ్నీని తొలగించడానికి వైద్యులు రోబోటిక్ లెఫ్ట్ రాడికల్ నెఫ్రెక్టమీ శస్త్రచికిత్సను ఖరారు చేశారు.ఈ శస్త్రచికిత్స గురించి అమోర్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ ఆంకాలజిస్ట్, అడ్వాన్స్‌డ్ లాపరోస్కోపిక్ & రోబోటిక్ సర్జన్ డాక్టర్ కల్యాణ్ వంగర మాట్లాడుతూ.. "సరైన పేషెంట్లను ఎంపిక చేసుకుని చేసే రోబోటిక్ సర్జరీ ఎంతో మేలు చేస్తుంది. చిన్న గాట్లతోనే చాలా ఖచ్చితత్వంతో శస్త్రచికిత్స చేయడానికి ఇది వీలు కల్పిస్తుంది. ఈ కేసులో పేషెంట్ సురక్షితంగా కోలుకోవడమే లక్ష్యంగా కిడ్నీ ట్యూమర్‌ను తొలగించాం. శస్త్రచికిత్స తర్వాత పేషెంట్ త్వరగా కోలుకుని, మూడో రోజే డిశ్చార్జ్ కావడం ఎంతో సంతృప్తినిచ్చింది" అని తెలిపారు.భారతదేశంలో తయారు చేసిన "మేక్ ఇన్ ఇండియా" ఎస్ఎస్ఐ మంత్ర (SSI Mantra) రోబోటిక్ సర్జికల్ సిస్టమ్ సహాయంతో ఈ శస్త్రచికిత్స జరిగింది. ఈ అత్యాధునిక రోబోటిక్ ప్లాట్‌ఫామ్ ద్వారా క్లిష్టమైన సర్జరీలను సైతం అత్యంత ఖచ్చితత్వంతో, తక్కువ గాట్లతో పూర్తి చేయవచ్చు.అమోర్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. బి. కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.."అంతర్జాతీయ స్థాయి అత్యాధునిక వైద్య సేవలను భారతీయ పేషెంట్లకు అందుబాటు ధరలలో అందించడమే అమోర్ హాస్పిటల్స్ లక్ష్యం. 'మేక్ ఇన్ ఇండియా' ఎస్ఎస్ఐ మంత్ర రోబోటిక్ సిస్టమ్‌ను విజయవంతంగా ఉపయోగించడం మా నిబద్ధతకు నిదర్శనం. ఆధునిక వైద్య సాంకేతికత, వైద్యుల నైపుణ్యంతో పేషెంట్లకు తక్కువ ఖర్చుతోనే మెరుగైన వైద్యం అందిస్తున్నాం" అని పేర్కొన్నారు.శస్త్రచికిత్స అనంతరం పేషెంట్ ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకుండా వేగంగా కోలుకున్నారు. దీంతో మూడో రోజే ఆయనను డిశ్చార్జ్ చేశారు. వైద్యుల సూచనల మేరకు ఆయన క్రమం తప్పకుండా ఫాలోఅప్‌కు హాజరవుతారు.ఈ సర్జరీని డాక్టర్ కల్యాణ్ వంగరతో పాటు కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పూజిత యల్లా నిర్వహించగా, మత్తు మందు నిపుణులు డాక్టర్ జగదీష్, క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ ప్రత్యూష నేతృత్వంలోని బృందం తగిన సహాయ సహకారాలు అందించింది.
తక్కువ కోత, తక్కువ నొప్పి, శస్త్రచికిత్సలో ఖచ్చితత్వం మరియు వేగంగా కోలుకోవడం రోబోటిక్ సర్జరీలోని ముఖ్య ప్రయోజనాలు. కడుపులో తరచూ లేదా స్పష్టమైన కారణం లేకుండా నొప్పులు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం ఎంతైనా అవసరమని ఈ కేస్ నిరూపిస్తోంది.

# పోడు రైతును పీడించిన లంచం.. ఏసీబీ వలలో ఫారెస్టు బీట్ ఆఫీసర్!

**- ట్రెంచ్ కొట్టకుండా ఉండేందుకు రూ.30 వేల డిమాండ్**
**- మధ్యవర్తి ద్వారా డబ్బు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత**
**- బానోత్ రవికుమార్, మధ్యవర్తి సాదిక్‌ఖాన్‌పై కేసు.. వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరు**
**- లంచం అడిగితే 1064కు ఫోన్ చేయండి: ఏసీబీ డీఎస్పీ వై. రమేష్**

**గుండాల, సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్:**



పోడు భూమిని సాగు చేసుకుంటున్న ఓ రైతును ట్రెంచ్ పేరుతో బెదిరించి, భూమికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే రూ.30 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఏసీబీ వలకు చిక్కాడు. అధికారి సూచనల మేరకు మధ్యవర్తి ద్వారా రైతు నుంచి నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన గుండాల-ఆళ్లపల్లి ఏజెన్సీ ప్రాంతంలో కలకలం రేపింది. ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచనపల్లి రేంజ్ పరిధిలోని వలసల్ల బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బానోత్ రవికుమార్ ప్రస్తుతం రామానుజగూడెం బీట్‌కు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నాడు.

**రెండున్నర ఎకరాల్లో పోడు సాగు**

రామానుజగూడెం గ్రామానికి చెందిన ఓ రైతు సుమారు రెండున్నర ఎకరాలకు పైగా భూమిలో సాగు చేస్తున్నాడు. ఇందులో దాదాపు రెండు ఎకరాలకు పట్టా ఉండగా.. మరో అర ఎకరం వరకు పట్టా లేకుండా పోడు సాగు చేస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఆ ప్రాంతంలో ప్లాంటేషన్ ఏర్పాటు కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో ట్రెంచ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో.. సదరు రైతు భూమిలోనూ ట్రెంచ్ తీస్తామని బీట్ ఆఫీసర్ చెప్పినట్లు ఫిర్యాదు అందింది.

**"రూ.30 వేలు ఇస్తే ఇబ్బంది ఉండదు"**

ఏసీబీకి అందిన ఫిర్యాదు ప్రకారం.. ట్రెంచ్ పనులతో పాటు పోడు భూమికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండాలంటే రూ.30 వేలు ఇవ్వాలని బీట్ ఆఫీసర్ రైతును డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంత మొత్తం తన వద్ద లేదని రైతు చెప్పినా.. డబ్బు ఇవ్వాల్సిందేనన్నట్లుగా వ్యవహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో చేసేదిలేక రైతు అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించాడు.

**రైతు ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ**

రైతు ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు ముందుగా వ్యవహారంపై విచారణ జరిపి అవసరమైన ఆధారాలను సేకరించినట్లు డీఎస్పీ వై. రమేష్ తెలిపారు. అనంతరం పక్కా ప్రణాళికతో గురువారం ఆపరేషన్ చేపట్టారు. బీట్ ఆఫీసర్ రవికుమార్ సూచనల మేరకు సాదిక్‌ఖాన్ అనే మధ్యవర్తి రైతు నుంచి రూ.30 వేల నగదు తీసుకునేందుకు రామానుజగూడెంకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. నగదు తీసుకుంటున్న సమయంలో అక్కడికి చేరుకున్న ఏసీబీ అధికారులు సాదిక్‌ఖాన్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మధ్యవర్తి నుంచి అందిన సమాచారంతో పాటు దర్యాప్తులో లభించిన ఆధారాల ఆధారంగా బీట్ ఆఫీసర్ రవికుమార్‌పైనా ఏసీబీ అధికారులు చర్యలు చేపట్టారు.

**రెండు రోజుల్లోనే చిక్కిన అవినీతి వ్యవహారం**

ఫిర్యాదు అందిన రెండు రోజుల్లోనే సరైన ఆధారాలతో ఆపరేషన్ నిర్వహించి చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ వై. రమేష్ తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా అవినీతిపై ప్రజలు అప్రమత్తంగా ఉన్నారని, లంచం డిమాండ్ చేస్తే ఏసీబీని ఆశ్రయించేందుకు వెనుకాడటం లేదన్నారు. ప్రభుత్వ సేవల కోసం ప్రజలు ఎవరికీ లంచం ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

**బీట్ ఆఫీసర్, మధ్యవర్తిపై కేసు**

లంచం తీసుకున్నారనే ఆరోపణలపై బానోత్ రవికుమార్, మధ్యవర్తి సాదిక్‌ఖాన్‌లపై కేసు నమోదు చేసి, తదుపరి న్యాయపరమైన చర్యలు చేపడుతున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. నిందితులను వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు. ఈ కేసులో లభించిన ఆధారాలు, సంబంధిత అధికారుల పాత్ర, లంచం వ్యవహారానికి సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

**ఏజెన్సీలో అవినీతికి చెక్!**

గుండాల, ఆళ్లపల్లి వంటి ఏజెన్సీ మండలాల్లో ప్రభుత్వ శాఖల సేవల కోసం వచ్చే ప్రజలు, రైతులు అవినీతి డిమాండ్లకు గురైతే నేరుగా ఏసీబీని ఆశ్రయించాలని వై. రమేష్ సూచించారు. అధికారులెవరైనా లంచం అడిగితే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదు చేసే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అవినీతిని సహించేది లేదని, లంచం డిమాండ్ చేసే ప్రభుత్వ ఉద్యోగులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**పోడు రైతు ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం**

భూమి, సాగు, అటవీ అనుమతుల వంటి అంశాలతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే గిరిజన, పోడు రైతులు ఎలాంటి ఒత్తిళ్లకు గురైనా మౌనంగా ఉండకుండా చట్టబద్ధ మార్గంలో ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు. ఒక రైతు ధైర్యంగా చేసిన ఫిర్యాదు.. లంచం వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకురావడంతో అటవీశాఖలో అవినీతి ఆరోపణలపై మరోసారి చర్చ మొదలైంది.

# వైభవంగా వేయి రోజుల ప్రజా పాలన వేడుకలు

**- కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిన నేతలు**
**- అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన**
**- పార్టీ నాయకులు**

**నాగార్జునసాగర్, సెప్టెంబర్ 3**
**అనంత జనశక్తి న్యూస్**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజుల ప్రజా పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నాగార్జున సాగర్ నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్ కాలనీ విజయ విహార్ వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గొడవర్తి రాజా ప్రసాద్ అధ్యక్షతన ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు,ఈ కార్యక్రమా నికి మున్సిపల్ చైర్మన్ మానసా స్వర్ణ రాష్ట్ర నాయకులు కర్ణ బ్రహ్మానందరెడ్డి

**హాజరయ్యారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకుంటూ ప్రభుత్వ విజయాలను గుర్తు చేసుకున్నారు,ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని తెలిపారు,ఈ వేడుకల్లో మున్సిపల్ కౌన్సిలర్లు ఈర్ల రామకృష్ణ, పగడాల నాగరాజు,మంద గౌతమి రఘువీర్ బిన్నీ,సాగర్ బాబు,కో ఆప్షన్ సభ్యులు ఎండి ముజీబ్,మాజీ కౌన్సిలర్ మంగతా**





**నాయక్,పార్టీ నాయకులు కృష్ణారెడ్డి,ఓబీసీ నాయకులు జంగన్న,ఉంగరాల శ్రీను,జానకి రెడ్డి, వెంకటేష్,రాజేష్‌తో పాటు,పార్టీ సోషల్ మీడియా సభ్యులు బాను,పలువురు పార్టీ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.**



# 1000 రోజుల ప్రజా పాలన – అభివృద్ధి, సంక్షేమం, మార్పుకు నిదర్శనం

## డాక్టర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్

**మహేశ్వరం, సెప్టెంబర్ 03,( అనంత జన శక్తి )**

మహేశ్వరం నియోజకవర్గం డాక్టర్స్ కాలనీ డివిజన్ ఏఎస్ఆర్ గార్డెన్స్ లో మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి టీపీసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత 1000 రోజుల్లో ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు మహిళలకు ఉచిత బస్సు, రూ.500కే గ్యాస్ సిలిండర్,200 యూనిట్ల ఉచిత విద్యుత్,రేషన్ కార్డులు, ప్రభుత్వ ఉద్యోగాలు,ఇందిరమ్మ ఇండ్లు,సన్న బియ్యం,మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు ఇలాంటివి అనేక సంక్షేమ కార్యక్రమాలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ, తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి అభినందనలు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు, సీనియర్ నాయకులు జంగారెడ్డి ,జనార్ధన్ గౌడ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు యూనిస్ ,డివిజన్ మహిళా అధ్యక్షురాలు అరుణ,నాయకులు ఆసిఫ్, అప్పారావు,అఫ్జల్,హబీబ్,సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలి




## -సెప్టెంబర్ 9న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి:సీఐటీయూ

**గుండాల, సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్:**

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ప్రీ ప్రైమరీ విద్యను కొనసాగించాలని, ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి జి. పద్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె. బ్రహ్మచారి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 9న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అంగన్‌వాడీలను నిర్వీర్యం చేసే చర్యలు ఆపాలి

అంగన్‌వాడీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సారమ్మ అధ్యక్షతన గుండాలలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో జి. పద్మ మాట్లాడుతూ.. ఐసీడీఎస్‌ను ప్రైవేటీకరించే ప్రయత్నాల్లో భాగంగా తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం సరికాదన్నారు. ప్రీ ప్రైమరీ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయడం వల్ల ఐసీడీఎస్ వ్యవస్థకు తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 4 వేలకుపైగా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేసే విధంగా నిర్ణయాలు తీసుకోవడం ఆందోళనకరమన్నారు. ప్రీ ప్రైమరీ విద్య పేరుతో చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రాథమిక పాఠశాలలకు తరలిస్తే వారికి అందుతున్న పాలు, గుడ్లు, బాలామృతం, బరువు కొలతలు, ఆరోగ్య పర్యవేక్షణ వంటి సేవలు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఆట వస్తువులతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

రూ.18 వేల వేతనం.. గ్రాట్యుటీ అమలు చేయాలి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రూ.18 వేల వేతనం అందించాలని, గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను సకాలంలో చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ప్రీ ప్రైమరీ విద్యను కొనసాగించాలని, తమ సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. సెప్టెంబర్ 9న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, జిల్లా నాయకురాలు ఎస్.హెచ్. సుల్తానా, మండల కన్వీనర్ వజ్జ సుశీల, మంజుల, వెంకటమ్మ, పూలమ్మ, చంద్రమ్మ, కౌసల్య, కోమల, ఊకె సుశీల తదితరులు పాల్గొన్నారు.

# పగడాల సతీష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బాలికకు ఆర్థిక సాయం

## -జగ్గయ్యగూడెం బాలికకు రూ.4 వేల హార్దిక సహాయం

**గుండాల, సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్:**

బీఆర్ఎస్ పార్టీ పినపాక మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గుండాల మండలం జగ్గయ్యగూడెం గ్రామానికి చెందిన చింత సంకీర్తన అనే బాలికకు రూ.4 వేల ఆర్థిక సహాయం అందించారు. సతీష్‌రెడ్డి తరఫున గుండాల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తెల్లం భాస్కర్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు మోకాళ్ల వీరస్వామి, పార్టీ నాయకుడు గడ్డం వీరన్న తదితరులు బాలికకు సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పగడాల సతీష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అవసరంలో ఉన్న బాలికకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. ప్రజా సేవతో పాటు ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ సతీష్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాల్ ఈసాల శ్రావణి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి టి. రాము, యువజన విభాగం అధ్యక్షుడు సయ్యద్ అజ్జు, గుండాల ఉపసర్పంచ్ తాటి పాపారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నిట్ట రాములు, పొంబోయిన సుధాకర్, మొక్క, బాలిక తల్లి చింత రజిత, పాఠశాల సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# భద్రాద్రికి రైలు వస్తుంది

- పాండురంగాపురం– మల్కన్‌గిరి రైల్వే లైన్ క్లియర్..
- సుమారు 16 కి.మీ. మేర రైల్వే లైన్ పనులను ముందుగా చేపట్టాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి
- మంత్రి విజ్ఞప్తిపై తక్షణమే సానుకూలంగా స్పందించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్
- పాండురంగాపురం– సాకేతపురి మధ్య భూసేకరణ చేపట్టి రైల్వే శాఖకు అప్పగించేందుకు రాష్ట్రం సిద్ధం
- రైల్వే కనెక్టివిటీతో భద్రాచలానికి ఆధ్యాత్మిక పర్యాటకం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపు

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో సెప్టెంబర్ 3 అనంత జనశక్తి న్యూస్ :**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి కీలకమైన పాండురంగాపురం-మల్కన్‌గిరి రైల్వే లైన్‌కు మరోసారి కదలిక వచ్చింది. వివిధ కారణాలతో పూర్తి ప్రాజెక్టు ఆలస్యమవుతున్న నేపథ్యంలో.. ప్రస్తుత దశలో పాండురంగాపురం నుంచి మధ్యలోని సాకేతపురి (సారపాక) వరకు సుమారు 16 కి.మీ. రైల్వే లైన్ పనులను ముందుగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించి, ఈ మార్గంలో పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**పూర్తి ప్రాజెక్టుకు పలు అవరోధాలు..**

రైల్వే మంత్రితో జరిగిన చర్చలో పాండురంగాపురం-మల్కన్‌గిరి రైల్వే లైన్ ప్రస్తుత పరిస్థితిని మంత్రి తుమ్మల వివరించారు. గతంలో రైల్వే మంత్రులుగా పనిచేసిన లాలూ ప్రసాద్ యాదవ్, మమతా బెనర్జీ, సురేశ్ ప్రభు, పీయూష్ గోయల్ హయాంలోనూ ఈ రైల్వే లైన్ ప్రతిపాదనకు అనుకూలత లభించినప్పటికీ.. వివిధ కారణాలతో పనులు పూర్తిస్థాయిలో ముందుకు సాగలేదని తెలిపారు. భూసేకరణ, అటవీశాఖ అనుమతులు, గోదావరి వంతెనతో పాటు ఇతర రైల్వే వంతెనల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియలు పూర్తి ప్రాజెక్టుకు ప్రధాన అవరోధాలుగా ఉన్నాయని మంత్రి వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిష్కరించి పాండురంగాపురం-మల్కన్‌గిరి పూర్తి రైల్వే లైన్‌ను నిర్మించేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

**సాకేతపురి వరకు ముందుగా పనులు..**

అయితే పాండురంగాపురం నుంచి సాకేతపురి (సారపాక) వరకు సుమారు 16 కి.మీ. మేర రైల్వే లైన్ నిర్మాణానికి పెద్దగా అవరోధాలు లేనందున.. ఈ దశలో ఆ పనులను ముందుగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి తుమ్మల కోరారు.పాండురంగాపురం-సాకేతపురి మధ్య రైల్వే లైన్‌కు అవసరమైన భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి, అవసరమైన భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి తెలిపారు.

**తుమ్మల విజ్ఞప్తికి తక్షణ స్పందన..**

మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. పాండురంగాపురం-సాకేతపురి మార్గంలో పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులను ఆదేశించారు. దీంతో ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న భద్రాద్రి ప్రాంత రైల్వే కనెక్టివిటీకి తొలి అడుగు పడినట్లయింది.

**భక్తులకు మరింత చేరువలో భద్రాచలం..**

దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఈ రైల్వే మార్గం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. సాకేతపురి వరకు రైల్వే సౌకర్యం అందుబాటులోకి వస్తే భద్రాచలం ప్రాంతానికి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. రైల్వే కనెక్టివిటీతో భద్రాచలంలో ఆధ్యాత్మిక పర్యాటకానికి కొత్త ఊపు వచ్చే అవకాశం ఉంది. భద్రాచలం, గోదావరి పరివాహక ప్రాంతాల్లో పర్యాటక కార్యకలాపాలు విస్తరించడంతో పాటు.. భక్తులు, పర్యాటకుల రాక పెరగడం ద్వారా స్థానికంగా ఉపాధి, వ్యాపార అవకాశాలు మెరుగుపడనున్నాయి.

**పారిశ్రామిక రంగానికి రవాణా బలం..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పారిశ్రామిక రంగానికి కూడా రైల్వే కనెక్టివిటీ కీలకంగా మారనుంది. సింగరేణి, బీపీఎల్, వాటర్ ప్లాంట్లు, కేటీపీఎస్ తదితర పరిశ్రమలకు ముడిసరుకు, ఉత్పత్తుల రవాణా మరింత సులభతరం కానుంది. రైల్వే సౌకర్యం అందుబాటులోకి రావడంతో కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు ఆకర్షించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడనుంది.

**భూసేకరణకు రాష్ట్రం సిద్ధం..**

కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించిన నేపథ్యంలో పాండురంగాపురం-సాకేతపురి మధ్య భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, అవసరమైన భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. పాండురంగాపురం-మల్కన్‌గిరి రైల్వే లైన్ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు ఒక్కొక్కటిగా తొలగుతున్న క్రమంలో.. ఈ దశలో సాకేతపురి వరకు రైల్వే లైన్ అందుబాటులోకి రావడం భద్రాద్రి ప్రాంత అభివృద్ధికి కీలక మలుపుగా నిలవనుంది. ఆధ్యాత్మిక పర్యాటకం, పారిశ్రామిక ప్రగతి, స్థానిక ఉపాధి, వ్యాపార అవకాశాలకు ఈ రైల్వే కనెక్టివిటీ మరింత బలాన్నివ్వనుంది.

# భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి
- సర్వే–రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి
- రెవెన్యూ, అటవీ సరిహద్దు వివాదాలకు పరిష్కారం
- ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు
- కేడస్ట్రల్, నాన్ కేడస్ట్రల్ గ్రామాలపై సమగ్ర పరిశీలన
- అధికారుల సమన్వయంతో సమస్యలకు శాశ్వత పరిష్కారం

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 3, అనంత జనశక్తి న్యూస్:**






ఉమ్మడి ఖమ్మం జిల్లాల పరిధిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ అంశాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, సర్వే-రీ సర్వే, కేడస్ట్రల్, నాన్ కేడస్ట్రల్ గ్రామాల సమస్యలు, రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న సరిహద్దు వివాదాలపై గురువారం సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రజలకు సంబంధించిన భూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. భూ సమస్యల కారణంగా సామాన్య ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే పరిష్కరించాలని, నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా సర్వే-రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు కేడస్ట్రల్, నాన్ కేడస్ట్రల్ గ్రామాలకు సంబంధించిన భూ రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న సరిహద్దు వివాదాలను అధికారులు పరస్పర సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. పినపాక సమస్యలను మంత్రి దృష్టికి పాయం

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ, అటవీ సరిహద్దులు, సర్వే-రీ సర్వేకు సంబంధించిన సమస్యలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. పినపాక నియోజకవర్గంలోని కేడస్ట్రల్, నాన్ కేడస్ట్రల్ గ్రామాల్లో సర్వే-రీ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని పాయం వెంకటేశ్వర్లు కోరారు. రెవెన్యూ-అటవీ సరిహద్దులపై ప్రజలకు స్పష్టత కల్పించడంతో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజల భూ హక్కులు, భూ రికార్డుల విషయంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, గ్రామస్థాయిలోని సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు.

ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో రెవెన్యూ, అటవీ శాఖలకు సంబంధించిన సరిహద్దు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని పాయం వెంకటేశ్వర్లు కోరారు. సమావేశంలో రెండు జిల్లాల పరిధిలోని రెవెన్యూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పరిస్థితి, సర్వే-రీ సర్వే పురోగతి, కేడస్ట్రల్, నాన్ కేడస్ట్రల్ గ్రామాల వివరాలు, రెవెన్యూ-అటవీ సరిహద్దు వివాదాలపై అధికారులు సమగ్ర వివరాలను మంత్రికి, ఎమ్మెల్యేలకు వివరించారు. సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి సంబంధిత అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, జారే ఆదినారాయణ, కోరెం కనకయ్య, రామ్‌దాస్ నాయక్, తెల్లం వెంకట్రావు, మట్టా రఘుమయి, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ, జిల్లా ఎస్పీతో పాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి శూన్యం

- రైతులతో కలిసి కందుకూరు చౌరస్తాలో బీఆర్ఎస్ భారీగా నిరసన
- రైతులకు సామాన్య ప్రజలకు చుక్కలు చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- కందుకూరు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్

**కందుకూరు, సెప్టెంబర్ 03,( అనంత జనశక్తి)**




కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నేటికి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరసనగా కందుకూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 100 రోజుల గ్యారంటీ కార్డులను ప్రజలకు పంచిపెట్టి, హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.కందుకూరు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులకు ఇచ్చిన హామీలు, పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు.కాంగ్రెస్ 100 రోజుల గ్యారంటీ కార్డులో ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ.. 1000 రోజుల పాలనలో వ్యవసాయంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమం, అభివృద్ధి తదితర అన్ని రంగాల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు."100 రోజుల్లో హామీల అమలు చేస్తామని చెప్పి.. 1000 రోజులు గడిచినా ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. హామీలు అమలు చేసే వరకు ప్రజల తరఫున బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుంది" అని నాయకులు స్పష్టం చేశారు.

రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో

కందుకూరు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మహేశ్వరం టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాజు నాయక్, కందుకూరు పిఎస్ఎస్ చైర్మన్ చంద్రశేఖర్, మహేశ్వర పిఎసిఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి, లేమూరు సర్పంచ్ మేఘనాథ్ రెడ్డి, దామోదర్ గౌడ్, మహేందర్, మాదాపూర్ మాజీ సర్పంచ్ సాయిలు, వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు పార్టీ సీనియర్ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పినకోటలో భూ హక్కుదారులకు పాస్ పుస్తకాల పంపిణీ

## 24 మంది భూ హక్కుదారులకు పాస్ పుస్తకాలు అందజేసిన అధికారులు

**అనంతగిరి, అనంత జన శక్తి న్యూస్, సెప్టెంబర్ 03:**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పినకోట పంచాయతీ పరిధిలోని తముటు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా భూ హక్కుదారులకు భూ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.అనంతగిరి డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 24 మంది భూ హక్కుదారులకు భూ పాస్ పుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం మాట్లాడుతూ.. భూ హక్కుదారులు తమకు అందించిన పాస్ పుస్తకాలను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. భూమికి సంబంధించిన అనేక సందర్భాల్లో ఈ పాస్ పుస్తకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గణేష్, వీఆర్వో ప్రియాంక, వీఆర్ఏలు, టీడీపీ నాయకుడు జాకేరు అప్పలకొండ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# 'ఇ.ఎం.ఐ' కష్టాలు



ప్రతి మధ్యతరగతి ఇంట్లో ఇ.ఎం.ఐ కష్టాలు తప్పవు. ఈ క్రమంలోనే యువత ఇ.ఎం.ఐ కట్టేందుకు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారనే కథాంశంతో రూపొందుతున్న చిత్రమే 'ఇ.ఎం.ఐ'. 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న 7పి.ఎం.ప్రొడక్షన్స్ దీన్ని నిర్మిస్తుంది. నిఖిల్ కువ్వరపు దర్శకత్వం వహిస్తున్నారు. దరహాస్, శైలజ జంటగా నటిస్తున్నారు. బుధవారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైందీ చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి హీరో ఆది సాయికుమార్ క్లాప్‌నివ్వగా, దర్శకుడు సాయి మార్తాండ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు రాహుల్ శ్రీనివాస్ స్క్రిప్ట్ అందజేశారు. త్వరలో ఈ సినిమాకి సంబంధించిన పూర్తి వివరాల్ని వెల్లడించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

# ఆ చిత్రానికి నేనే దర్శకత్వం వహిస్తా!

ఆరు నుంచి... అరవయ్యేళ్ల వయసున్న ప్రేక్షకుల వరకూ అందరికీ నచ్చేలా మా 'రోమాంచకం' ఉంటుందన్నారు సుమంత్ ప్రభాస్. ఆయన కథానాయకుడిగా... ప్రముఖ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా సమర్పణలో రూపొందిన సినిమానే ఇది. వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మాత. గురువారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సుమంత్ ప్రభాస్ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటిస్తూ...

"కుటుంబంతో కలిసి చూసినా, స్నేహితులతో కలిసి చూసినా హాయిగా నవ్వుకుంటూ ఆస్వాదించే సినిమాలు కొన్ని ఉంటాయి. అలాంటి సినిమానే 'రోమాంచకం'. హైదరాబాద్ కుర్రాడి కథ. డిగ్రీ పూర్తయ్యాక స్టార్టప్ కంపెనీని మొదలుపెట్టే ఆలోచనలో




ఉన్న ఓ యువకుడి కథతోనే ఈ చిత్రం రూపొందింది. సినిమా పూర్తయ్యాక సందీప్ అన్న చూశారు. 'అమాయకత్వం, ఆవేశం, ఉత్కంఠ ప్రదర్శిస్తూనే ఓ హీరోలా తెరపై కనిపించడం అంటే మాటలు కాదు. చాలా బాగా చేశావు' అని మెచ్చుకున్నారు. ఇప్పటివరకూ నాకు దక్కిన అత్యుత్తమ ప్రశంస అది. మొన్న వేదికపై కూడా అదే మాట చెప్పారు. కథానాయకుడు ప్రభాస్‌కి నేను ఫ్యాన్‌బాయ్‌ని. అందుకే నా పేరుకి ఆయన పేరుని జోడించుకున్నా. నిన్ననే ప్రభాస్ అన్నని కలిశాం. వాళ్లింటికి వెళితే ఆయన ఎలా ఆతిథ్యం ఇస్తారో అందరికీ తెలుసు. ఆ అంచనాల్ని మించి ఆయన మమ్మల్ని చూసుకున్నారు. ఒక్కసారిగా నా ప్రయాణమంతా గుర్తొచ్చింది, కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఈమధ్యే నన్ను దృష్టిలో ఉంచుకునే నేనొక కథ రాశా. అది ఎప్పుడు చేయాలా అని ఆలోచిస్తున్నా. ఆ చిత్రానికి నేనే దర్శకత్వం వహిస్తా. ప్రస్తుతం 'రాజు వెడ్స్ రాంబాయి' ఫేం సాయిలు కంపాటి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నా. ఈ నెలలోనే చిత్రీకరణ మొదలవుతుంది" అన్నారు.

# భయానక ప్రపంచంలోకి అజయ్

'భూత్', 'కాల్', 'షైతాన్' లాంటి చిత్రాలతో హారర్ ప్రియుల్ని అలరించారు బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్. ఇప్పుడాయన మళ్లీ హారర్ జానర్‌లోకి అడుగుపెట్టబోతున్నారు. అజయ్ ప్రధాన పాత్రలో రోహిత్ జుగ్రాజ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. చిత్రీకరణను మొదలు పెట్టినట్లు సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టారు అజయ్. "భయానక ప్రపంచంలోకి వచ్చేశాం. సీటు అంచున కూర్చోబెట్టే ఈ హారర్ థ్రిల్లర్ కోసం వేచి ఉండండి" అనే వ్యాఖ్యల్ని జోడించారు. దీన్ని దేవగణ్ ఫిల్మ్స్, పనోరమా స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి 'గృహ ప్రవేశ్' అనే పేరు పరిశీలనలో ఉందని, గరుడ పురాణం ప్రేరణతో దీన్ని తీర్చిదిద్దుతున్నారని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగు తున్నాయి.

# 'హనుమాన్ అంశ్'.. మాజీ క్రికెటర్ సెహ్వాగ్ ఎమోషనల్ పోస్ట్..!




ఎలాంటి స్టార్స్ లేకుండా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న తాజా చిత్రం 'హనుమాన్ అంశ్'. ఇటీవల హిందీలో విడుదలైన ఈ మూవీ కేవలం మౌత్ టాక్‌తోనే రూ.70 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, హనుమాన్ భక్తుడు నీమ్ కరోలి బాబా(మహరాజ్‌జీ) జీవితం, ఆయన బోధనల ఆధారంగా ఈ సినిమాను విశాల్ చతుర్వేది తెరకెక్కించారు. తాజాగా ఈ మూవీ చూసిన టీమ్ ఇండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. ఈ మూవీ మహరాజ్‌కు భక్తిపూర్వక వందన సమర్పణ అని కొనియాడారు.

"కొన్ని అనుభూతులు, కొందరు వ్యక్తులను వర్ణించడానికి మాటలు సరిపోవు. వారి గురించి ఎంత చెప్పినా తక్కువే. నా స్నేహితుల్లో కొందరు నీమ్ కరోలి బాబాకు భక్తులుగా ఉన్నారు. పదేళ్ల కిందట ఆయన గురించి నాకు చెప్పారు. అప్పటి నుంచి ఆయన గురించి వింటూ, చదువుతున్నా. మహరాజ్ జీ వ్యక్తిత్వం, ఆయన భక్తి, నన్నెంతో ఆకర్షించాయి. ఆయన ఆశీస్సులు ఎంతో మంది జీవితాలు మార్చేశాయి. కొద్ది రోజుల కిందట ఆయన జీవిత కథ ఆధారంగా రూపొందిన 'హనుమాన్ అంశ్' చూశా. ఆయన జీవితాన్ని ఒకే ఒక సినిమాలో చూపించడం అసాధ్యం. అయినా కూడా దీనిని చాలా అద్భుతంగా, అందంగా చూపించారు. మహరాజ్‌జీకి ఇది నిజమైన వందనం. సినిమాలో ఆయన చుట్టూ పాములు ఉన్న సన్నివేశం నన్నెంతో కదలించింది. ఆయన భక్తులలో ఒకరు, 'మీరు శివుడిలా అమాయకులు' అని అంటారు. అందుకు ఆయన బదులిస్తూ 'అమాయకులు మీరే. మన హృదయాల్లో ఉన్నదాన్నే కళ్లు చూస్తాయి' అని అంటారు. బహుశా ఆయన మనందరికీ చెప్పాలనుకున్నది ఇదేనేమో. మన దేశ చరిత్రలో ఇలాంటి సాధువులు అరుదుగా జన్మిస్తారు. ఆయనను అర్థం చేసుకోవడం అసాధ్యం, కానీ ఆయనను ఒక్కసారి చూడటం సాధ్యమే. మీకు ఆయన గురించి తెలిస్తే, ఈ సినిమా చూడండి.. ఒకవేళ ఆయన గురించి వినకపోతే, తప్పకుండా చూడండి" అని సెహ్వాగ్ అన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధం...

ఇప్పుడు ఈ మూవీ ప్రపంచ ప్రేక్షకులకు అందించడానికి హోంబలే ఫిల్మ్స్ ముందుకు వచ్చింది. సెప్టెంబరు 11వ తేదీన ఈ సినిమాని ఓవర్సీస్‌లోనూ విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేసింది. 'కేజీయఫ్', 'కాంతార' వంటి చిత్రాలను ప్రేక్షకులకు అందించిన హోంబలే ఫిల్మ్స్ ఇప్పుడు చిన్న మూవీ 'హనుమాన్ అంశ్'ను ప్రోత్సహించడం గమనార్హం. 'విశ్వాసంతో కూడిన కథ. సరిహద్దులు దాటి ప్రయాణం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల కోసం ఈ సినిమాను అందుబాటులోకి తెస్తున్నాం. మహరాజ్ జీ ఆధ్యాత్మిక ప్రయాణం సెప్టెంబరు 11న విడుదల కానుంది" అని పేర్కొంది.

# ఘోరంగా ఓడింది గాక.. తిరిగి భారత్‌పైనే పాక్ అక్కసు!




ఇంగ్లాండ్ చేతిలో వరుసగా రెండు టెస్టుల్లో ఘోర ఓటమిపాలైన పాకిస్థాన్‌జట్టుపై ఆ దేశ మాజీలు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. పాక్ క్రికెట్ బోర్డు సరిగా లేకపోవడం వల్లే పాక్ క్రికెట్ పతనమవుతోందంటూ మండిపడ్డారు. అయితే, పీసీబీ చీఫ్ మోసిన్ నఖ్వీ మాత్రం తమ జట్టు ప్రదర్శనను సమర్థించుకుంటున్నాడు. అదే సమయంలో జట్టు వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఇటీవల కొన్ని పెద్ద జట్లు.. చిన్న టీమ్‌ల చేతిలో ఓడిన విషయాన్ని ప్రస్తావించాడు.

"మిమ్మల్ని ఒక విషయం అడుగుతాను. ఇటీవల కాలంలో చిన్న జట్ల చేతిలో పెద్ద జట్లు ఓడిపోయాయి. అంతటితో అక్కడ క్రికెట్ ముగిసిపోయిందా? మాకు ఎవరైతే అవసరమో వారిని కచ్చితంగా జట్టులోకి తీసుకుంటాం. ఎవరైనా రాణించకపోతే లేదా ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయకపోతే మేమేం చేయగలం? మాకు ప్రతి మ్యాచ్, ప్రతి సిరీస్ ఎంతో ముఖ్యం. కచ్చితంగా టెస్ట్ మ్యాచ్‌లో జరిగిన దానిని తప్పుగా పరిగణించలేం. మేం ఈ రెండు మ్యాచ్‌లలో ఓడిపోయాం. కానీ, దేవుని దయతో వన్డేలు, టీ20ల్లో మాదిరిగానే రాబోయే రోజుల్లో టెస్టుల్లో పురోగతి సాధిస్తామని నమ్ముతున్నా. నేను విమర్శలకు ఎప్పుడూ భయపడలేదు, ఇకపై కూడా భయపడను.

నేను పీసీబీ చీఫ్‌గా వచ్చినప్పటి నుంచి క్రికెట్ నాశనమైందని అనేవారు ఒక విషయం గుర్తుంచుకోవాలి. మేం ఈ కోచింగ్ బృందాన్ని తీసుకురాకముందు జట్టు ర్యాంకింగ్స్ ఎలా ఉండేవో చూడండి. వన్డేల్లో ఎనిమిదో స్థానంలో ఉండేవాళ్లం. ఇప్పుడు ఐదో స్థానంలో ఉన్నాం. అలాగే టీ20ల్లో తొమ్మిదో స్థానం నుంచి ఆరో స్థానానికి వచ్చాం" అని మోసిన్ నఖ్వీ వ్యాఖ్యానించాడు. ఈ ఏడాది జూన్‌లో ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత్ ఓటమిపాలైన విషయం తెలిసిందే. కొన్ని రోజుల క్రితం ముక్కోణపు టీ20 సిరీస్‌లో నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాకు చుక్కెదురైంది. ఈ ఫలితాలను ఉద్దేశించే మోసిన్ నఖ్వీ తాజాగా ఈ తరహా వ్యాఖ్యలు చేశాడని, పీసీబీ చీఫ్ జట్టును సరైన దారిలో నడిపించకుండా భారత్‌పై అక్కసు వెళ్లగక్కడం సరికాదంటూ క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# నడిపించిన నాయకుడు

టీ20 క్రికెట్లో ఇప్పటికే తనేంటో రుజువు చేసుకున్న హైదరాబాద్ కుర్రాడు తిలక్ వర్మ.. ఇప్పుడు ఫస్ట్‌క్లాస్ క్రికెట్లోనూ సత్తా చాటుకున్నాడు. దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో రెండు ఇన్నింగ్స్‌లోనూ అదరగొట్టిన సౌత్ జోన్ కెప్టెన్.. తన జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లాడు. బుధవారం ముగిసిన మ్యాచ్‌లో సౌత్ 7 వికెట్ల తేడాతో నార్త్ జోన్‌పై విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో 116 పరుగులు చేసిన తిలక్ వర్మ రెండో ఇన్నింగ్స్‌లో విలువైన అర్ధశతకం (51 నాటౌట్; 79 బంతుల్లో 8×4) సాధించడంతో సౌత్.. 181 పరుగుల లక్ష్యాన్ని 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 43.1 ఓవర్లలో ఛేదించింది. అభేద్యమైన నాలుగో వికెట్‌కు రవిచంద్రన్ స్మరణ్ (32 నాటౌట్)తో తిలక్ 80 పరుగులు జోడించాడు. ఓపెనర్లు రికీ భుయ్ (42), నారాయణ్ జగదీశన్ (43) కూడా కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. నార్త్ బౌలర్లలో అబిద్ ముస్తాక్ (2/55) ఆకట్టుకున్నాడు. అంతకుముందు 256/7తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన నార్త్.. 297 పరుగులకు ఆలౌటైంది. చివరి ముగ్గురూ బ్యాటర్లను నిధీశ్ (5/56) బౌల్డ్ చేసి ప్రత్యర్థి కథ ముగించాడు. తొలి ఇన్నింగ్స్‌లో నార్త్ 195 పరుగులకే ఆలౌట్ కాగా.. సౌత్ 312 పరుగులు చేసింది. తిలక్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు. సౌత్, ఈస్ట్ జోన్ల మధ్య దులీప్ ట్రోఫీ ఫైనల్ ఆదివారం మొదలవుతుంది.

'టెస్టు' అంటే ఎంతో ఇష్టం

టెస్టు క్రికెట్ అంటే తనకు చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టమని టీమ్‌ఇండియా టీ20 వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అన్నాడు. కెప్టెన్ ఇన్నింగ్స్‌లతో సౌత్ జట్టును దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు చేర్చిన నేపథ్యంలో తిలక్ మాట్లాడుతూ.. "ఎర్ర బంతి క్రికెట్ ఆడడాన్ని ఎప్పుడూ ఆస్వాదిస్తా. భారత జట్టుకు పరిమిత ఓవర్ల క్రికెట్లో ప్రాతినిధ్యం వహిస్తానని ఎప్పుడూ కలగనలేదు. అది దేవుడి




ప్రణాళిక. నేను ఐపీఎల్ వల్ల టీ20లు, వన్డేల్లో భారత్‌కు ఆడగలిగాను. కానీ నా బలం ఎర్ర బంతి క్రికెట్టే. పదేళ్ల వయసు నుంచి ఆ ఫార్మాట్లో రాణించేందుకు కష్టపడ్డాను. టెస్టులు నాకెంతో ఇష్టమైన ఫార్మాట్. అంతర్జాతీయ షెడ్యూల్ వల్ల మూణ్నాలుగేళ్లుగా నేను రంజీ ట్రోఫీలో ఆడదామన్నా ఎక్కువ కుదరట్లేదు. సుదీర్ఘ ఫార్మాట్లో ఇలాగే రాణించి.. భారత టెస్టు జట్టులోకి రావాలనుకుంటున్నా" అని చెప్పాడు.

# భారత్ పాక్ పోరును చూసే తీరు ఇకనైనా మారాలి

భారత్ - పాకిస్థాన్ మ్యాచ్ అంటేనే హైటెన్షన్. తమ జట్టే గెలవాలని ఆయా దేశాల అభిమానులు బలంగా కోరుకుంటారు. అయితే, ఈ విధానం మారాల్సిన అవసరం ఉందని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ వసీం అక్రమ్ అన్నాడు. అలాగే, భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్‌తో తనకున్న పరిచయంపైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. పఠాన్‌ను తొలిసారి 2004 ఆస్ట్రేలియా పర్యటన సమయంలో కలిసినట్లు గుర్తు చేసుకున్నాడు

"2004లో ఇర్ఫాన్ పఠాన్ తొలిసారి ఆస్ట్రేలియా పర్యటనలో కలిశాడు. అప్పుడు నేను ఈఎస్‌పీఎన్ స్టార్‌కు వ్యాఖ్యాతగా ఉన్నా. అతడు నాకు పెద్ద ఫ్యాన్. మా ఆటను చూస్తూ పెరిగాడు.



ఆ సిరీస్ సందర్భంగా అప్పుడు కొన్ని సలహాలు ఇచ్చా. కెరీర్ ఆరంభం నుంచే ఇర్ఫాన్ అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించాడు. మొదట్లో నా బౌలింగ్ శైలిలానే ఉండేది. కుర్రాళ్లు మమ్మల్ని ఏదైనా సలహా అడిగినప్పుడు ప్రధానంగా మైండ్‌సెట్ గురించే చెబుతాం. మణికట్టు పొజిషన్, ప్రత్యర్థి బ్యాటర్‌ను ఎలా అంచనా వేయాలనే అంశాలపై మాట్లాడతాం. ఇర్ఫాన్ మంచి కుర్రాడే. ఇప్పటికీ కలుస్తూనే ఉంటాం. అయితే, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తరచూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూనే ఉంటాడు. మా అభిమానులు కూడా అందుకు సిద్ధంగానే ఉంటారు. అలాంటి వాటికి సమాధానం ఇస్తుంటారు" అని అక్రమ్ తెలిపాడు.

అతీతంగా వెళ్లొద్దు..

"భారత్ - పాకిస్థాన్ మ్యాచ్‌కు విపరీతమైన హైప్ తీసుకొస్తారు. క్రికెట్‌ను ఓ ఆటగానే చూడాలని కోరతా. అందుకు అతీతంగా వెళ్లొద్దని చెబుతా. ప్రజలకు చాలా ఖాళీ సమయం ఉన్నట్లుంది. వారు ఎందుకు అర్థం చేసుకోవడం లేదో? ఇది కేవలం ఒక మ్యాచ్ మాత్రమే. చివరికి ఎవరో ఒకరు గెలవాలి. మరొకరు ఓడిపోవాలి. తర్వాత మ్యాచ్ కోసం సన్నద్ధమవ్వాలి. ఎప్పుడో 1970ల నుంచి ప్రతీకారం అంటూ ఇప్పటికీ అలానే ఆలోచించడం సరికాదు. ఖాళీగా ఉండే మనసు చెడు ఆలోచనలకు నిలయం అన్నట్లుగా కొందరి పరిస్థితి ఉంది. దాన్నుంచి బయటపడాలి" అని అక్రమ్ వ్యాఖ్యానించాడు..

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945